సిటీ టైమ్స్
తెలుగు దినపత్రిక

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; హేమంత రుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం ఏకాదశి: రా. 11 27 తదుపరి ద్వాదశి స్వాతి: సా. 539 తదుపరి విశాఖ వర్జ్యం: రా. 1147 నుంచి 133 వరకు అమృత ఘడియలు: ఉ. 756 నుంచి 942 వరకు దుర్ముహూర్తం: ఉ. 1010 నుంచి 1054 వరకు తిరిగి మ. 233 నుంచి 316 వరకు రాహుకాలం: మ. 130 నుంచి 300 వరకు సూర్యోదయం: ఉ. 6.32; సూర్యాస్తమయం: సా.5.28

## నల్గొండలో కల్తీకల్లు కలకలం.. ఏడుగురికి అస్వస్థత

**నల్గొండ:** నల్లగొండ జిల్లాలో కల్తీ కల్లు కలకలం సృష్టిస్తోంది. శాలిగౌరారం మండలం, పెరిక కొండారం గ్రామంలో కల్తీకల్లు తాగి ఏడుగిరి పరిస్థితి విషమంగా మారింది.కల్తీ కల్లు తాగిన తర్వాత అస్వస్థతకు గురి కావడంతో అప్రమత్తమైన స్థానికులు బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం నకిరేకల్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందుతోంది. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

గురువారం- 26- డిసెంబర్ 2024 | సంపుటి : 25 సంచిక : 185 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com




## శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం

### అల్లు అరవింద్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో బాధిత కుటుంబానికి రూ.2కోట్ల సాయం అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించిన అనంతరం ఆయన ప్రకటించారు. నటుడు అల్లు అర్జున్ తరపున రూ.కోటి.. పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. దిల్ రాజు, పుష్ప 2 నిర్మాత రవిశంకర్‌తో కలిసి అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. అనంతరం అల్లు అరవింద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ''శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వెంటిలేషన్ తీసేశారు. బాలుడు త్వరలోనే మనందరి

(మిగతా 2 లో)

# తెలంగాణలో ప్రజాపాలన భేష్

## పొన్నం లేఖకు రాహుల్ గాంధీ రిప్లై



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాసిన లేఖపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇందిరమ్మ రాజ్యంలో రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో మరింత ముందుకు వెళ్తామని పేర్కొంటూ మంత్రి పొన్నం.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాహుల్ నాయకత్వంలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా.. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ విజయవంతంగా ముందుకు వెళ్తున్నట్లు లేఖలో ప్రస్తావించారు. పొన్నం ప్రభాకర్ రాసిన లేఖకు స్పందిస్తూ.. రాహుల్ గాంధీ తిరిగి లేఖ రాశారు. హామీలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతోన్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ చేపట్టిన కార్యక్రమాలను తాను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని.. ప్రజాప్రభుత్వంలో ఉత్తమ పనితీరు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.



## మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు

2

## వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుంది

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**



హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ విధానాన్ని ప్రతిపాదించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. దేశంలో అత్యంత

(మిగతా 2 లో)

## 'రేవంత్ సర్కార్ మహిళల్ని నమ్మించి మోసం చేసింది'

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**



రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు.

(మిగతా 2 లో)

## ప్రేమ పేరుతో వేధింపులు.. యాసిడ్ తాగి యువతి మృతి

### నగరంలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**



నగరంలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జవహర్‌నగర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన కుటుంబసభ్యులు.. ఆందోళనకు దిగారు. తమ కుమార్తె మరణానికి కారణమైన యువకుడిని ఇప్పటివరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిలదీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని.. నిందితుడిని అరెస్టు చేస్తామని పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.




### సంధ్య థియేటర్ ఘటన..

## తప్పుడు పోస్ట్‌లపై పోలీసుల వార్నింగ్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ''తొక్కిసలాట ఘటనపై

(మిగతా 2 లో)



## వాజ్‌పేయి నిస్వార్థంగా పని చేశారు

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

మాజీ ప్రధాని వాజ్‌పేయి భారత దేశ వైభవాన్ని, నైతిక విలువలను ప్రపంచానికి చాటారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. వాజ్‌పేయి పదవులకు ఆశపడకుండా

(మిగతా 2 లో)

## భవానీ దీక్షల విరమణ.. ఇంద్రకీలాద్రిపై భారీ రద్దీ

**విజయవాడ,(సిటీ టైమ్స్):**

భవానీ దీక్షల విరమణతో విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై భారీగా రద్దీ నెలకొంది. దీక్షల విరమణ చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున భవానీలు తరలివస్తున్నారు. ఆలయ అధికారులు అన్ని క్యూ లైన్లలోనూ ఉచితంగానే దుర్గమ్మ దర్శనానికి అనుమతిస్తున్నారు. క్యూలో ప్రవేశించిన వారికి దర్శనం పూర్తయ్యేసరికి 2నుంచి 3గంటల సమయం పడుతోంది. జగన్మాత నామస్మరణతో ఇంద్రకీలాద్రి

(మిగతా 2 లో)





## ఫార్ములా ఈరేసు కేసు.. దాన కిశోర్ వాంగ్మూలం నమోదు

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

ఫార్ములా ఈరేసు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిర్యాదుదారుడు, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. దీని ఆధారంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు నోటీసులిచ్చే అవకాశం ఉంది. ఈమేరకు ఏసీబీ సిద్ధమవుతోంది. ఫార్ములా ఈరేసు నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీసంస్థకు సొమ్ము చెల్లించారంటూ దానకిశోర్ ఏసీబీకి

(మిగతా 2 లో)



## వాజ్‌పేయి రాజనీతి తప్పలేదు

### అనురాగ్ ఠాకూర్

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**

పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి మధ్య మంచి అనుబంధం ఉండేదని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ గుర్తు చేశారు. కార్పొరేటర్ నుంచి ప్రధాని వరకు ఎదిగిన వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి

(మిగతా 2 లో)



## మానవ అక్రమ రవాణా.. కెనడా కాలేజీలపై ఈడీ నిఘా

2

సిటీటైమ్స్ తెలుగు దినపత్రిక city times




## వాజ్‌పేయీ రాజనీతి తప్పలేదు

(మొదటి పేజీ తరువాయి)

శత జయంతి ఉత్సవాల్లో భాగంగా భాజపా రాష్ట్ర కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అనురాగ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోతున్నామని తెలిసినా వాజ్‌పేయీ రాజనీతి తప్పలేదని కొనియాడారు. జనతా పార్టీలో విదేశాంగ మంత్రిగా, భాజపా వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ప్రధానిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందని కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో పాస్‌పోర్టు రావాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేదని, ఆయన విదేశాంగ మంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. నిస్వార్థంగా, సిద్ధాంతాల కోసం పనిచేసే లక్షమంది యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలనేది వాజ్‌పేయీ కల అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'రేవంత్ సర్కార్ మహిళల్ని నమ్మించి మోసం చేసింది'

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. తక్షణమే స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు.



## వేగంగా అభివృద్ధి చెందుతోన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణ గరిష్ఠ విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందన్నారు. 202324లో 15,623 మెగావాట్లు, 202728లో 20,968 మెగావాట్లు, 203435లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2024పై వచ్చే నెల 3న హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో వాటాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని భట్టి తెలిపారు.



## ఫార్ములా ఈరేసు కేసు.. దాన కిశోర్ వాంగ్మూలం నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది అక్టోబరు 18న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారాస హయాంలో పురపాలక శాఖ మంత్రిగా వ్యవహరించిన కేటీఆర్‌ను ప్రధాన నిందితుడి (ఏ1)గా పేర్కొంటూ తెలంగాణ ఏసీబీ ఇటీవల కేసు నమోదు చేసింది. పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందకుమార్ (ఏ2), హెచ్ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి (ఏ3)లనూ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది.

# మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు



**మెదక్:**

వందేళ్లు పూర్తిచేసుకున్న మెదక్ చర్చికి దేశస్థాయిలో గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చానని.. సీఎం హోదాలో మళ్లీ వస్తానని అప్పట్లో మాటిచ్చానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లలో దళిత, గిరిజన క్రైస్తవులకు అత్యధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం వివరించారు.

ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న సీఎం రేవంత్

**ఏడుపాయల:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఏడుపాయలలో వనదుర్గామాతను ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు.

### సంధ్య థియేటర్ ఘటన..

## తప్పుడు పోస్ట్‌లపై పోలీసుల వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి)




సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పాటు ప్రజలను అపోహలకు గురిచేసేలా వీడియోలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నటుడు అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్లు కొందరు తప్పుడు వీడియోలు పోస్ట్ చేసిన అంశం మా దృష్టికి వచ్చింది. ఘటనపై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసుశాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. ఉద్దేశపూర్వకంగా పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు పోస్ట్‌లు పెడితే తీవ్రంగా పరిగణిస్తాం. ఈ ఘటనకు సంబంధించి ఏ పౌరుడి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే మాకు అందించవచ్చు'' అని నగర పోలీసులు పేర్కొన్నారు.

## భవానీ దీక్షల విరమణ.. ఇంద్రకీలాద్రిపై భారీ రద్దీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిధ్వనిస్తోంది. అమ్మవారి దర్శనం అనంతరం భవానీ ఘాట్, పున్నమి ఘాట్, సీతమ్మవారి పాదాల సమీపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కేశఖండన శాల వద్ద దీక్షాదారులు తలనీలాలు సమర్పిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇవాళ పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ కార్యక్రమం పరిసమాప్తం కానుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివస్తోన్న భవానీలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఆలయ ఈవో రామారావుతోపాటు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఇతర శాఖల అధికారులు మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి భక్తుల రద్దీ, దర్శనాలు, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.





## వాజ్‌పేయీ నిస్వార్థంగా పని చేశారు

(మొదటి పేజీ తరువాయి)

నిస్వార్థంగా పని చేశారని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా.. ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారని కొనియాడారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్తున్న పార్టీ భాజపా అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అబద్ధాల్లో ఆ పార్టీకి ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చన్నారు. బడుగు, బలహీనర్గాలు ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఉన్నాయని చెప్పారు.

**రేవంత్‌రెడ్డి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు: భాజపా ఎంపీ లక్ష్మణ్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమ్యూనిస్టు వేషాన్ని వేసుకొని ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని భాజపా ఎంపీ లక్ష్మణ్ అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని చెప్పారు. ఆ పార్టీ నేతలు భాజపా, కేంద్ర ప్రభుత్వం మీద విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. దేశానికి వెన్నుపోటు పొడిచి.. మీడియా ముందుకొచ్చి మొసలి కన్నీరు కారుస్తానంటే ఎవరు నమ్మరని ఎద్దేవా చేశారు. సైనికులను కూడా కాంగ్రెస్ పార్టీ అవహేళన చేసి మాట్లాడుతోందని మండిపడ్డారు.

**అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు: కేంద్ర మంత్రి బండి సంజయ్**

కాంగ్రెస్ నేతలకు అంబేడ్కర్ గురించి మాట్లాడే అర్హత లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ''ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తాళాలు వేశారు. ఆయన చరిత్ర తెలిపేలా ఉన్న గదుల్లోకి వెళ్లనివ్వడం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా అక్కడికి వెళ్లలేదు. భాజపా ఒత్తిడి మేరకు గత భారాస ప్రభుత్వం ఆ విగ్రహ నిర్మాణం పూర్తి చేసింది. అంబేడ్కర్‌కు సంబంధించిన పంచ తీర్థాలను రాహుల్ గాంధీ దర్శనం చేస్కోవాలి. అల్లు అర్జున్ ఎపిసోడ్ వెనక చాలా అనుమానాలు వస్తున్నాయి. సినీ పరిశ్రమ ఆంధ్రాకు పోవాలని కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. ఇండస్ట్రీ ఆంధ్రాకు తరలివెళ్తే తెలంగాణకే నష్టం. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుండా వారి అధిష్ఠానం అదుపులో పెట్టాలి'' అని బండి సంజయ్ అన్నారు.



## శ్రీతేజ్ కుటుంబానికి రూ.2కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

మధ్య తిరుగుతాడని ఆశిస్తున్నా. న్యాయపరమైన అంశాల కారణంగా బాధిత కుటుంబ సభ్యులను కలవలేకపోతున్నా. అన్ని రకాల అనుమతులు తీసుకుని శ్రీతేజ్‌ను 10 రోజుల క్రితం పరామర్శించా. ఆ సమయంలో వెంటిలేషన్‌పై ఉన్నాడు'' అని అల్లు అరవింద్ తెలిపారు. ''నిన్నటికి, ఈరోజుకి బాలుడి ఆరోగ్యం కాస్త మెరుగు పడింది. అతడి హెల్త్ కండిషన్ బాగుందని వైద్యులు తెలిపారు. బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్, 'పుష్ప 2' నిర్మాతలు, దర్శకుడు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగాం. సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రిని కలిసి చర్చిస్తాం. హీరోలు, దర్శకులు, నిర్మాతలం కలిసి వెళ్తాం. గురువారం ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుంది'' అని దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ అయినందుకు సీఎంను కలుస్తున్నారా? ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య చోటుచేసుకున్న పరిణామాల గురించి వెళ్తున్నారా? అని దిల్ రాజును మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. తాను చిత్ర పరిశ్రమ వ్యక్తినని, ఇండస్ట్రీ ప్రభుత్వం మధ్య వారధిగా ఉండాలని సీఎం బాధ్యత ఇచ్చారని, అదే చేస్తున్నానన్నారు. అల్లు అర్జున్‌ను కలిశారా? అని అడగ్గా ఇంకా లేదని, త్వరలోనే కలుస్తానని చెప్పారు.

# మానవ అక్రమ రవాణా.. కెనడా కాలేజీలపై ఈడీ నిఘా

కెనడా సరిహద్దుల నుంచి అమెరికాలోకి భారతీయులను అక్రమంగా తరలించేందుకు సంబంధించి డబ్బులు చేతులుమారిన మనీలాండరింగ్ కేసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేస్తోంది. ఇందులోభాగంగా కెనడాలోని కొన్ని కాలేజీలు, భారత సంస్థల పాత్రపై విచారణ చేపట్టినట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. 2022 జనవరి 19న గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం కెనడా సరిహద్దు నుంచి అక్రమంగా అమెరికాలోకి ప్రవేశిస్తున్న సమయంలో తీవ్రమైన శీతల వాతావరణం కారణంగా మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఆధారంగా చేసుకొని ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భవేష్ పటేల్‌తో పాటు మరికొందరిపైనా మనీలాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. నిందితులు మానవులను అక్రమంగా తరలించే సంస్థలతో కలిసి కుట్ర పన్ని.. భారత ప్రజలకు మాయమాటలు చెప్పి వారిని దేశ సరిహద్దులు దాటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాంటివారిని కెనడా మీదుగా అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం కెనడా, అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని, విదేశాల్లో స్థిరపడాలని కోరుకునే భారతీయులను ట్రాప్ చేస్తున్నట్లు తమ దర్యాప్తులో కనుగొన్నామన్నారు. ఈ వ్యవహారంలో ఒక్కో వ్యక్తి నుంచి రూ.55 రూ.60 లక్షల వరకు వసూలుచేసినట్లు వెల్లడించారు. కానీ, విద్యార్థి వీసాపై కెనడాకు వెళ్లినవారు అక్కడి విశ్వవిద్యాలయాల్లో చేరట్లేదన్నారు. దీంతో కాలేజీలు వారి నుంచి తీసుకున్న అడ్మిషన్ ఫీజును తిరిగి ఆయా వ్యక్తుల ఖాతాల్లో జమ చేసేవారని తెలిపారు. అలా వెళ్లినవారు చట్టవిరుద్ధంగా కెనడా యూఎస్ సరిహద్దును దాటుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారం కోసం ఈ కేసులో ముంబయి, నాగ్‌పూర్, గాంధీనగర్ వంటి 8 ప్రదేశాల్లో సోదాలు చేపడుతున్నట్లు ఏజెన్సీ తెలిపింది. విదేశాల్లోని యూనివర్సిటీల్లో భారతీయులకు ప్రవేశం ఇప్పించడానికి ముంబయి, నాగ్‌పూర్ ఉన్న రెండు సంస్థలు పని చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. వీరు ఏటా దేశంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 35వేల మంది విద్యార్థులను దేశం దాటిస్తున్నారని తెలిపారు.



# చట్టం వీరికి చుట్టమా...!

- అమ్మ ప్రశాంతిగారు... అంత ప్రశాంతమేనా.
- అక్రమ నిర్మాణాలను పట్టించుకోరా
- అనుమతులు ఒకలా కట్టేది మరోల
- సర్కిల్-18లో నోటీసులు ఇస్తారు... చర్యలు సంగతేంటి?
- అటకెక్కిన టిజిబిపాస్ చట్టం

**హైదరాబాద్/ఖైరతాబాద్, డిసెంబర్ 25,సిటీ టైమ్స్:** అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిన అవి అమలు చేయడంలో అధికారు లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. హైదరాబాద్ నగరాన్ని దేశంలోనే ఎ1 సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నోవిధాలుగా కృషిచేస్తుంటే ప్రభుత్వ ఆశయాలకు అధికారులే తూట్లు పొడుస్తున్నారు. అక్రమనిర్మాణాల పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంటే జిహెచ్ఎంసి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తుం డడంతో అక్రమ నిర్మాణదారులు ఆకాశమే హద్దుగా నిర్మాణాలను చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిదిలో అక్రమ నిర్మాణాల ను నిర్మూలించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసు కువచ్చిన దీజీబిపాస్ చట్టం అబాసుపాలవుతుంది. నగరంలో వివిఐపీ, విటపీలు, తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రులు.. డిప్యూటీ సిఎం, మంత్రలు, సినీపరిశ్రమకు చెందిన నివసించే సర్కిల్ 18లో అక్ర మనిర్మాణాలు పెరిగిపోయాయి. సర్కిల్ 18 పరిధిలో ని బంజారాహిల్స్, వెంకటేశ్వర్ నగర్, జూబ్లీహిల్స్, షేక్పేట్, టోలిచౌకి డివిజన్లలో నిర్మాణదారులు అను మతులకు విరుద్ధంగా భారీ భవనాలను నిర్మిస్తున్నా రు. అక్రమనిర్మాణాలపై సర్కిల్ 18 అధికారి డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ ప్రశాంతికి పిర్యాదుచేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమాల కు తావిస్తుంది. జిహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణదారులకు పిర్యాదు రాగానే మొదటి నోటీసు ఇచ్చి 15 రోజుల అనంతరం మరో నోటీసు ఇవ్వాల్సి ఉంది. అనంతరం 7రోజుల కోసం షోకాజ్ నోటీసు ఇచ్చి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో వీరిపై పలు అనుమానాలు తావిస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులకు "చట్టం వీరికి చుట్టం"గా తయారైందని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ ని ర్మాణాలపై పలువురు పిర్యాదుచేస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల అవి నీతికి నిదర్శనంగా నిలుస్తుంది. అక్రమనిర్మాణాలను ఆపాల్సిన సర్కిల్ అధికారి కేవలం ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర విషయాలపై చర్చిస్తు సమావేశాలతో కాలయా పన చేస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణదారుల నుంచి టిడిఆర్ రూపేనా వసూలు చేయాల్సి ఉండగా ఇవేమి తమకు పట్టనట్టు సర్కిల్ అధికారి వ్యవహరిస్తుండడంతో జిహెచ్ఎం సి ఖజానాకు కోట్లాది రూపాల ఫీజు నష్టం వాటిల్లు తుంది. అయినప్పటికీ సర్కిల్ 18 అధికారి ప్రశాంతి ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రశాంతంగా తన విధులను కొనసాగిస్తుండడం.



జుబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1లో అనుమతి లేకుంటా నిర్మిస్తున్న వాణిజ్య భవనం


ఫీలింనగర్ రోడ్ నెంబర్ 5లో అనుమతి లేకుంట నిర్మిస్తున్న వాణిజ్య భవనం

**అనుమతి ఒకలా... కట్టేదిమరోలా**

సర్కిల్ 18లో నిబంధనలకు విరుద్ధంగా వందలాది భవనాలు నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే అది అధికారుల అలసత్వమా లేక ఉన్నతాధికారుల లంచగొండి తనమా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇదే సర్కిల్లో నివాసగృహాల కోసం అనుమతి తీసుకొని వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారు. మరికొంత మంది అనుమతి కంటే విరుద్ధంగా అదనపు భవ నాలను నిర్మిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్నం. 10 ప్రధాన. రహదారిలో ఓ ఇంటి యజమాని ఇ.నెం. 82685/1/ఏ, సెల్లార్, స్టిల్డ్ 4అంతస్తుల భవనానికి అనుమతి తీసుకొని స్టిల్ట్, మరో అదనపు అంతస్తుని నిర్మిస్తున్నాడు. నిర్మించిన అదనపు అంతస్తుకి దాదాపు టిడిఆర్ 1కోటి రూపాయలు కట్టాల్సి ఉండగా అనే మిచెల్లించకుండా బిందాసుగా నిర్మాణాన్ని చేపడుతు న్నారు. అదేవిధంగా ఒక ఆర్కిటెక్చర్ తన క్లైయింట్ కోసం నివాస గృహం కోసం ప్లాట్ నెం. 65, రోడ్నెం. 1, జూబ్లీహిల్స్, అనుమతి తీసుకొని ఏకంగా స్టిల్ట్ తోపాటు ఒక అదనపు అంతస్తుని నిర్మిస్తున్నారు. దాదాపు కమర్శియల్ కోసమే జిహెచ్ఎంసి ఫీజు రూపేణ 1కోటి రూపాయలు చెల్లించాల్సి ఉండగా అవేమి చెల్లించకుండనే అంతధైర్యంగా నిర్మిస్తున్నా డంటే వారికి అధికారుల అండ చూసుకొన లేకా చట్టం మీద గౌరవం లేకనా అనే అనుమానం తలె త్తుతుంది. అలాగే ఫిలింనగర్ రోడనెం.5, ఇ.నెం. 82 291/82/02, ప్లాల్ నెం. 2, 8లలో నిబంధనలకు విరుద్ధంగా 2అదనపు అంతస్తులతో పాటు పక్కనే ఉన్న మరో భవన యజమాని వాణిజ్య సముదాయం కోసం అనుమతి తీసుకోకుండానే అక్రమంగా నిర్మా ణాన్ని చేపడుతున్నాడు. ఫిలింనగర్లో ఇ.నెం. 82293, టిఎన్. ప్లాట్నెం. 234, 240, 241లో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులను నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు నోటీసులు ఇవ్వలేదు, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంతగా భరితెగించి నిర్మాణాలు దేపడు తుంటే సర్కిల్ అధికారి కళ్లు మూసుకున్నారా అని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టి వారికి సహకరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**టౌన్ ప్లానింగ్లో సిబ్బంది ఏరి...?**

జిహెచ్ఎంసికి అత్యధికంగా శేరిలింగంపల్లి జోన్అ రువాత ఖైరతాబాద్ జోన్ సర్కిల్ 18లో రెవెన్యూ అత్యధికంగా వస్తుంది. అయినప్పటికీ సర్కిల్ 18 డిఎంసి టౌన్లోనింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న సిబ్బందిని ఎందుకు నియమించడం లేదు. గత జిహెచ్ఎంసి కమీషనర్ అమ్రపాలి బాధ్యతలు తీ సుకున్నానా మొత్తం. జిహెచ్ఎంసి అన్ని సర్కిల్లో ప్ర క్షాళన చేసి పలువురి బదిలీ చేశారు. అయినప్పటికీ సర్కిల్ 18లో నాలుగు డివిజన్లకు గాను ఒక్క ఎసిపి, ఒకేఒక సెక్షన్ అధికారినినియమించారు.ముగ్గురు


ఫిలిం నగర్ లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

చైన్ మెన్లు, నలుగురు వ్యాక్ ఇంజనీర్లు ఉండాల్సి ఉండగా ఇప్పటివరకు నియమించక పోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఒకేఒక చైన్మెను నియమించడంతో నోటీసులు ఇవ్వాలన్న, అక్రమని ర్మాణాలని అడ్డుకోవాలన్న కుదరడం లేదు. ఇప్పటికే సర్కిల్ 18లో వందలాది అక్రమనిర్మాణాలపై పిర్యా దులు రావడం గమనార్హం. అయినప్పటికీ చర్యలు తీసుకోక పోవడం వెనక సిబ్బంది లేకపోవడం ఒక కారణంగా కనిపిస్తుంది. ఇతర సర్కిల్లో అక్రమ ని ర్మాణాలపై చర్యలు తీసుకుంటుంటే సర్కిల్ 18లో మాత్రం ఎలాంటి చర్యలు లేవు.



## నిజాంపేటలో ఘనంగా టిడిపి సభ్యత్వ నమోదు

**నిజాంపేట్, సిటీటైమ్స్:** హైదర్ నగర్ డివిజన్ నిజాంపేట్ రోడ్ లో కొడాలి రవికుమార్ ఆధ్వర్యం లో టిడిపి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నందమూరి సుహాసిని, లీడర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. బుధవారం మహాల క్ష్మీ అపార్ట్మెంట్ లో నందమూరి సుహాసిని చేతుల మీదుగా పలువురు టిడిపి కార్యకర్తలు అభిమానులు సభ్యత్వం పెద్ద ఎత్తున తీసుకున్నారు. ఈ కార్యక్ర మంలో సంజన , సదా మహేష్ , అశోక్ యాదవ్, సరస్వతి, ఆంజనేయులు గౌడ్, హైదర్ నగర్ రాము, గుర్రం అశోక్, శేషయ్య, నందమూరి వెంకట్రామ్, నాగార్జున, టి రమేష్, వేమూరి నాగేశ్వరరావు, నందిగామ శ్రీనివాస్, వినయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని

**సనత్ నగర్,డిసెంబర్ 25, సిటీ టైమ్స్:** ఏసుక్రీస్తు బోధనలు మానవాళిని సన్మార్గంలో నడిపిస్తాయని, ఏసు సూక్తులు ప్రతి ఒక్కరు ఆచరించదగినవని మా జీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్ష లు తెలియజేస్తూ బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం మొత్తం ఎంతో గొప్పగా జరుపుకొనే ఏకైక పండుగ క్రిస్మస్ అని ఆయన పే ర్కొన్నారు. సాటివారి పట్ల ప్రేమ, త్యాగం, కరుణ చూపాలని ఏసుక్రీస్తు తన సందేశంలో పేర్కొన్నారని తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా నెలరోజుల ముందు నుండే చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనలు, రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరించి ఏసుక్రీస్తును ఎంతో భక్తితో ఆరాదిస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం



నిర్వహించే క్రిస్మస్ తమ ఇంట సుఖ సంతోషాలను తీసుకొస్తుందని క్రైస్తవులు విశ్వసిస్తారని తెలిపారు.






# టౌన్ ప్లానింగ్ విభాగం చేతివాటమే చట్టమా?

- అక్రమ నిర్మాణలపై ఫిర్యాదులు బుట్టదాఖలు
- నిజాంపేట్ లో అక్రమ కమర్షియల్ నిర్మాణాలు
- ఇండియన్ గ్యాస్ కల్పనా గ్యాస్ ఏజెన్సీ గోదాం
- విజ్ఞాన్ స్కూల్ కు వెళ్లే దారిలో ఉన్న రోడ్డు కబ్జా
- అడ్డగోలుగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు
- అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగమే అండగా
- చెలరేగిపోతున్న అక్రమ భవన నిర్మాణదారులు

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** మున్సిపల్ చట్టం చేసిందే మా చేతివాటం కోసం.. మాకివ్వాల్సిన ముడుపులు ముట్టచెప్పి ఏ చట్టంతో పనిలేకుండా దర్జాగా మీ పని చేసేసుకోండి అన్న చందంగా కొంతమంది అధికా రుల పనితీరుందనే విమర్శలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో చర్చనీయాంశంగా మారాయి. మున్సి పల్ చట్టం, అగ్నిమాపక చట్టాలతో పనిలేదన్నట్లుగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో అధికారుల



తీరుందని పలువురు విమర్శకుల వాదనలున్నాయి. మున్సిపల్ కమిషనర్, ఏసీపీ, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి వరకూ కాసుల కక్కుర్తిలో మునిగిపోయారనే ఆరోపణలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే అక్రమ నిర్మాణదారులకు సమాచారం చేరవేస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తూ సహకరిస్తున్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు.

**నివాస భవన నిర్మాణ అనుమతితో వ్యాపార సముదాయ నిర్మాణాలు**

జనావాసాలలో నివాస భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని కమర్షియల్ బిల్డింగ్స్ నిర్మిస్తున్నారని ఫిర్యా దులు చేసినా సంబంధిత అధికారుల పట్టింపు లేదు. రెండు అంతస్తుల వరకు అనుమతులు తీసుకుని అదనపు అంతస్తులతో 5, 6 అంతస్తుల వరకు అక్ర మంగా నిర్మాణాలు చేస్తూ, ప్రమాదకరంగా అను మతులు లేని సెల్లార్లతో చట్టాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఇళ్లు కట్టేస్తున్న పరిస్థితి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో కలవరపెడుతోందంటున్నా రు సామాజిక కార్యకర్తలు. ఇంత చట్ట విరుద్ధంగా జరుగుతున్నా, ఎన్ని ఫిర్యాదులు వస్తున్నా చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ కమిషనర్, ఏసీపీ శ్రద్ధ చూపకుండా కార్యాలయానికే పరిమితం కావడం ఎన్నో అనుమానాలకు తావిస్తుందన్నారు. ఇలా ఎన్నో అక్రమ నిర్మాణాల వెనుక అధికారులు, కొందరు చైన్ మెన్ లు ఉంటూ ప్రభుత్వ ఆదాయంకు గండి కొడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకి ఆజ్యం పో స్తున్నారు.

**అడ్డగోలుగా కమర్షియల్ షెటర్స్.. రోడ్డుపైనే అక్రమ నిర్మాణం**

గత వారం రోజుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుం డా నిజాంపేట్ విలేజ్ లో కల్పనా గ్యాస్ గోదాం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ లో ధర్జాగా అక్రమ నిర్మాణం చేపట్టారు. గ్యాస్ ఏజెన్సీ యజమానితో టౌన్ ప్లానింగ్ అధికారులు పరోక్షంగా సహకరిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి తమ జేబులు దండుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ కి అపవాదు తెస్తున్నారు. వ్యాపార సముదాయంగా నిర్మించిన అక్రమ గదుల ప్రదేశానికి అతి సమీపంలో గ్యాస్ గోదాం ఉండడంతో ఎప్పుడైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన అక్రమ నిర్మాణంను తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.. అలాగే నిజాంపేట్ విజ్ఞాన్ హై స్కూల్ కు వెళ్లే దారిలో రోడ్డును కబ్జా చేసి అక్రమంగా ఓ రూమును నిర్మించారు. ఈ రోడ్డు ఆక్ర మణపై కూడా గతంలో పలు మార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో స్థానికంగా పలు విమర్శలు వెలువడుతున్నాయి.



## నిజాంపేటలో ఘనంగా వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు

**నిజాంపేట్,సిటీటైమ్స్:** జనసంఘ్ నుండి భారతీయ జనతా పార్టీగా మారడానికి కృషిచేసిన ప్రముఖ వ్యక్తులలో వాజ్ పేయి కూడా ఒకరని నిజాంపేట్ బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ తెలిపారు. బుధవారం నిజాంపేటలో హనుమాన్ టెంపుల్ వద్ద భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతిని పురస్కరించుకొని శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా నిజాంపేట అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. వాజ్ పేయి ఆధ్వర్యంలో దేశంలోని మారుమూల ప్రాంతాలలో కూడా సడక్ యోజన పథకం కింద కలుపుతూ రోడ్లు వేయడమే కాకుండా మొట్టమొదటిసారిగా పోక్రాన్ అను పరీక్షలు నిర్వహించి భారతదేశాన్ని అనుసంపత్తి కలిగిన శక్తివంతమైన దేశంగా నిలబెట్టినటువంటి ఘనత వాజ్ పేయికి దక్కిందని గుర్తు చేశారు. మూడు సార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన వాజ్ పేయి మొదటి దశలో 13రోజుల తన పరిపాలనలోనే ఏదో ఒక రోజు పార్లమెంటులో సంపూర్ణమైన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆనాడే జోష్యం చెప్పారు. ఆయన వేసిన బాటలోనే నడుస్తూ విలువలతో కూడిన రాజకీయాలతో ముందుకు వెళ్తూ ప్రపంచంలోనే శక్తివంతమైన అత్యధిక కార్యకర్తలతో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది అన్నారు. ఆయన ఆశయ సాధనలో భాజపా కార్యకర్తలు అందరూ పని చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, మా మీడియా సెల్ కన్వీనర్ సుమన్ ,అప్పారావు, దేవేందర్ రెడ్డి ,పద్మ ప్రసాద్, శేషారావు ,సతీష్ కృష్ణ, కౌశిక్, రవి యాదవ్, నరసింహారెడ్డి, నిజాంపేట ట్రేడర్ సెల్ కన్వీనర్ నరేష్ గుప్తా, వెంకటేష్ ముదిరాజ్ ,రాజేష్ ,మహేష్ పాండు తదితర నాయకులు పాల్గొన్నారు.



## గణంగాఅయ్యప్ప పడి పూజ గురుస్వామి సండ రమేష్ ను గణంగా సన్మానించిన బారస నేతలు

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** సండ రమేష్ గురుస్వామి 18 వ మహాపడి పూజ సందర్భంగా రమేష్ గురుస్వామి ని బారస నేతలు జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్ కౌన్సిలర్ కాగితాల లక్ష్మీనారాయణ గణంగా సన్మానించారు బాల ఆంజనేయ స్వామి దేవాలయం లో జరిగిన అయ్యప్ప పూజ సండ రమేష్ 18 వ సారి మాల ధరించి నారికేళ స్వామి గా శబరి యాత్ర సందర్భంగా నిర్వహించిన మహాపడి పూజ ఉదయం గణపతి పూజ సుబ్రమణ్యస్వామి పూజ అయ్యప్ప అభిషేకం అష్టోత్తరం పడి పూజ గణాంగ నిర్వహించారు కార్యక్రమం లో స్వాములు చంద్రశేఖర్ బోలేమోని నరసింహ కానిస్టేబుల్ శ్రీను మళ్లీ పాల్గొన్నారు.



## బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుని సన్మానించిన మదనాపురం మండల బి ఆర్ఎస్ యువ నాయకులు

**మదనాపురం సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** కౌకుంట్ల మండలంలోని బి ఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కేబీఆర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాల్వాతో సన్మానించిన మదనాపురం మండల బీఆర్ఎస్ యువ నాయకులు. ఈ కార్యక్రమంలో మదనపురం హర్షద్. మహమూద్. సంపత్ గౌడ్. నాయిని రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ ఉద్యోగి వెంకటయ్య జన్మదిన వేడుకలు

**కొత్తకోట సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** కొత్తకోట మున్సిపల్ ఉద్యోగి కొత్తకోట ప్రజల కోసం నిరంతర శ్రమికునిగా పనిచేసి కుల మతాలతో సంబంధం లేకుండా మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన కొమ్ము వెంకటయ్య జన్మదినం సందర్భంగా వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము సురేష్, రాజారామ్ యాదవ్, నారమన్ ఏసు, కటికే శ్రీనివాసులు , జనంపల్లి కిరణ్ , కొమ్ము అనిల్ కొమ్ము అమర్ కాలనీ యూత్ కొమ్ము రవి కుమార్ జేమ్స్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.





# మీ చేతి ఉన్నివస్త్రం

'తపాలా బండి గంటల చప్పుడుకు ఏ పడుచు పిల్లయినా నిద్ర లేచినా మళ్లీ అటు తిరిగి పడుకుని తియ్యటి కలలు కంటుంది' అని ఉంటుంది చెహోవ్ రాసిన 'ఒక చలి రాత్రి' కథలో! ఊహించండి. దట్టమైన చలికాలం. రాత్రి మూడు గంటల సమయం. ఏ వెధవ ప్రాణమైనా ముడుక్కుని పడుకుని కాసింత సుఖాన్ని అనుభవించే వేళ. ఒడలు మరిచే వేళ. వెచ్చదనమూ భోగమే అని భావించే వేళ. పొట్టకూటి కోసం, రోజూ చేయాల్సిన పని కోసం తపాలా మూటలను బగ్గీలో వేసుకుని స్టేషనుకు చేర్చక తప్పని మెయిల్‌మేన్ మనసులో ఎలా ఉంటుంది? నిశ్శబ్దాన్ని కప్పుకొని గాఢ సుషుప్తిలో ఉన్న ఊరి వీధుల గుండా అతడొక్కడే చలికి వణుకుతూ, కన్ను పొడుచుకున్నా కానరాని చీకటిలో వెళుతూ ఉంటే అతడి అంతరంగ జగాన ఏముంటుందో ఆ సమయాన ఇళ్లల్లోని గదుల్లో రగ్గుల చాటున శయనిస్తున్న మనుషులకు తెలుస్తుందా?

శ్రీమంతులు కూడా భలే వాళ్లులే! చలి రాత్రుళ్లలో వారికి మజాలు చేయాలనిపిస్తుంది. అతిథులను పిలవాలనిపిస్తుంది. పార్టీలూ గీర్టీలూ. పనివాళ్లను తొందరగా ఇళ్లకు పొండి అంటారా ఏమి? లేటు అవర్సు వరకూ పని చేయాల్సిందే! బయట చలి ఉంటుంది. పాకల్లో పసిపిల్లలు 'కప్పుకోవడానికి ఇవాళైనా దుప్పటి కొనుక్కుని రా నాన్నా' అని కోరడం గుర్తుకొస్తూ ఉంటుంది. ఒంటి మీదున్న ఈ కనాకష్టం బట్టలతో ఇంతరాత్రి చలిలో ఇంటికి ఎలా చేరాలనే భీతి ఉంటుంది.

వెచ్చటి ద్రవాలు గొంతులో ఒంపుకునే శ్రీమంతులు 'ఒరే... ఆ రగ్గు పట్టుకుపో' అంటారా? 'ఈ పాత స్వెటరు నీ కొడుక్కు తొడుగు' అని దయతో పారేస్తారా? ఆ సోయి ఉంటే కొందరు ఎప్పటికీ శ్రీమంతులు కాలేరు. పాపం పనివాడు రంగడు పార్టీలో యజమాని ఉండగా ఆ అర్ధరాత్రి రగ్గు దొంగిలిస్తాడు. పేదవాణ్ణి దొంగను చేసింది లోపలి పెద్దమనిషా... బయటి చలా? డి.వెంకట్రామయ్య 'చలి' కథ ఇది. దర్శకుడు బి.నరసింగరావు కథలు కూడా రాశారు. 'చలి' అనే కథ. నగరానికి వచ్చిన వెంటనే మొగుడు పారిపోతే ఆ వలస కూలీ చంకన బిడ్డతో వీధుల్లో తిరుగుతూ చలిరాత్రి ఎక్కడ తల దాచుకోవాలా అని అంగలారుస్తుంటుంది. అక్కడ నిలబడితే ఎవరో కసురుతారు. ఇక్కడ నిలబడితే ఎవరో తరుముతారు. నోరూ వాయి లేని చెట్టు 'పిచ్చిదానా... నిలుచుంటే నిలుచో. నీకేం వెచ్చదనం ఇవ్వలేను' అని చిన్నబోతూ చూస్తుంది.

చెట్టు కింద తల్లీబిడ్డా వణుకుతుంటారు. చలి. చెట్టు కింద తల్లీ బిడ్డా కొంకర్లు పోతూ ఉంటారు. శీతలం. చెట్టు సమీపంలోని చాటు అటుగా వచ్చి ఆగిన కారులోని యువతీ యువకులకు మంచి ఏకాంతం కల్పిస్తుంది. బయట చలి మరి. ఒకే తావు. చెట్టు కింద చావుకు దగ్గరపడుతూ తల్లీబిడ్డ. అదే తావులో ఏమీ పట్టని వెచ్చని సరస సల్లాపం. చలి ఒకటే! బహు అర్థాల మానవులు.

శతకోటి బీదలకు అనంతకోటి ఉపాయాలు. పేదవాడు బతకాలంటే నోరు పెంచాలి. లేదా కండ పెంచాలి. కండ పెంచిన మల్లయ్య రైల్వేస్టేషన్ దగ్గర సగం కట్టి వదిలేసిన ఇంటి వసారాను ఆక్రమించుకుంటాడు. తక్కిన కాలాల్లో దాని వల్ల లాభం లేదు. చలికాలం వస్తే మాత్రం రాత్రిళ్లు తల దాచుకోవడానికి అలగా జనాలు ఆ వసారా దగ్గరికి వస్తారు. తలకు ఒక్కరూపాయి ఇస్తే వెచ్చగా పడుకునేందుకు చోటు.

కొందరి దగ్గర ఆ రూపాయి కూడా ఉండదు. దీనులు. పేదవాడు మల్లయ్య దయ తలుస్తాడా? తరిమి కొడతాడు. లేచిన ప్రతి ఆకాశహర్మ్యం నా ప్రమేయం ఏముందని నంగనాచి ముఖం పెట్టొచ్చుగాని అది ఎవడో ఒక పేదవాడిలో మంచిని చంపి రాక్షసత్వం నింపుతుంది. వి. రాజా రామమోహనరావు 'చలి వ్యాపారం' కథ ఇది.

చలిరాత్రి ఎప్పటికీ అయిపోదు. అది పేదవాళ్లకు తామెంత నగ్నంగా జీవిస్తున్నారో గుర్తు చేయడానికే వస్తుంది. చలికి వణికే కన్నబిడ్డల్ని చూపి బాధ పెట్టడానికే వస్తుంది. మనందరం మధ్యతరగతి వాళ్లమే. ఇంటి పనిమనిషిని అడుగుదామా 'అమ్మా... నీ ఇంట ఒక గొంగళన్నా ఉందా... పిల్లలకు ఉన్ని వస్త్రమైనా ఉందా?'.... 'చలికి వ్యక్తి మృతి' అని వార్త.

మనిషి చలికి ఎందుకు చనిపోతాడు? ప్రభుత్వం అతనికి ఇస్తానన్న ఇల్లు ఇవ్వకపోతే, ఇల్లు ఏర్పాటు చేసుకునేంత ఉపాధి చూపకపోతే, నీ దిక్కులేని బతుకును ఇక్కడ వెళ్లదీయమని వింటర్ షెల్టరైనా చూపకపోతే, తన నిర్లక్ష్యాన్ని తోడు చేసుకుని చలి హత్యలు చేయగలదని గ్రహించకపోతే అప్పుడు ఆ వ్యక్తి 'చలికి చనిపోయిన వ్యక్తి'గా వార్తలో తేలుతాడు. విలియమ్ సారోయాన్ అనే రచయిత రాస్తాడు– చలి నుంచి కాపాడటానికి కనీసం శవాల మీదున్న వస్త్రాలనైనా తీసివ్వండ్రా అని! అతని కథలో ఒక యువకుడు ఆకలికి తాళలేక ఓవర్‌కోట్ అమ్మి చలితో చచ్చిపోతాడు.

పగిలిన గాజుపెంకుతో కోసినట్టుగా ఉంటుందట చలి. అదంత తీవ్రంగా ఉండేది మనుషుల్లో నిర్దయను పెంచడానికా? కాదు! దయను పదింతలు చేయడానికి! పాతదుప్పట్లో, పిల్లలు వాడక వదిలేసిన స్వెటర్లో, నాలుగు కంబళ్లు కొనేంత డబ్బు లేకపోలేదులే అని కొత్తవి కొనో వాటిని స్కూటర్లో, కారులో పడేసి ఆఫీసు నుంచి వచ్చేప్పుడు ఒక్కరంటే ఒక్కరికి ఇచ్చి వస్తే ఎలా ఉంటుందో ఈ చలికాలంలో చూడొద్దా? ఉబ్బెత్తు బ్రాండెడ్ బొంతలో నిద్రపోయే వేళ మన చేతి ఉన్నివస్త్రంతో ఒక్కరైనా నిద్ర పోతున్నారన్న భావన పొందవద్దా? అదిగో... అర్థమైందిలే... మీరు అందుకేగా లేచారు!

# హసీనా అప్పగింత సాధ్యమేనా?

బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ మన దేశానికి తలెత్తుతున్న దౌత్య సమస్యలకు తాజాగా మరొకటి వచ్చిచేరింది. గత ఆగస్టు నుంచీ భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని సోమవారం బంగ్లా విదేశాంగ శాఖ దౌత్య సందేశం పంపింది. హసీనా అవినీతి పాలనను వ్యతిరేకిస్తూ విద్యార్థుల నాయకత్వంలో జనాగ్రహం వెల్లువెత్తి ఆమె ఆ దేశం నుంచి నిష్క్రమించారు.

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ మైనారిటీలకూ, హసీనా హయాంలో బాధ్యతలు నిర్వర్తించిన నేతలకూ, ఉన్నతాధికారులకూ గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దాడులూ, దౌర్జన్యాలూ, నిర్బంధాలూ తప్పడం లేదు. ఆఖరికి న్యాయమూర్తుల్ని సైతం వెంటాడుతున్నారు. భయోత్పాతంలో ముంచెత్తుతున్నారు.

చాలామంది అజ్ఞాతంలోకి పోయారు. దీన్నంతటినీ ఆపాలనీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలనీ మన దేశం ఇప్పటికే బంగ్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ కక్షపూరిత చర్యలు ఎక్కడా తగ్గిన దాఖలా లేదు. పైగా భారత మీడియా ఉన్నవీ లేనివీ కల్పించి తప్పుడు ప్రచారం చేస్తున్నదని అక్కడి ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాదు... దానికి సమాంతరంగా అంతా బాగానే ఉన్నట్టు చూపించే ప్రయత్నం చేస్తోంది.

'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చిన కథనమే ఇందుకు ఉదాహరణ. విద్యార్థి బృందాలు దేశాభివృద్ధికి, అవినీతి అంతానికి ప్రణాళికలు వేస్తున్నట్టు ఆ కథనం సారాంశం. మైనారిటీలు సురక్షితంగా ఉన్నట్టు ఆ వర్గాలతోనే చెప్పించారు. నోబెల్ శాంతి బహుమతి పొందిన యూనస్ పాలన తీరుతెన్నులు గమనిస్తే పరిస్థి తులు ఆయన నియంత్రణలో ఉన్నట్టు కనబడదు.



మైనారిటీల సంగతలావుంచి అసలు ముస్లిం మహిళలకే ఇబ్బందులు తప్పడం లేదు. మత ఛాందసవాదులు రంగంలోకి దిగి బురఖా ధరించని బాలికలనూ, మహిళలనూ నడిరోడ్లపై పంచాయతీలు పెట్టి హింసిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. హసీనా ఏలుబడిలో అవినీతి పెరిగిందనటంలో సందేహం లేదు. పదవి కాపాడుకొనేందుకు ఎన్నికల ప్రక్రియను ఏమార్చారన్న ఆరోపణల్లో కూడా నిజం వుంది. కానీ దానికి విరుగుడు ఈ అరాచకమా?!

ప్రభుత్వాలను కూలదోసిన సందర్భాల్లో పాలకులు పరారీ కావటం, వేరేచోట ఆశ్రయం పొందటం అసాధారణమేమీ కాదు. హసీనా ఢిల్లీకి ఆదరాబాదరాగా వచ్చినా ఇక్కడినుంచి లండన్ వెళ్లాలని ప్రయత్నించారు. కానీ బ్రిటన్ ఆమె వినతిని తోసిపుచ్చింది. బంగ్లాలో హఠాత్తుగా బయ ల్దేరిన ఉద్యమానికి అమెరికా ఆశీస్సులున్నాయని ఆరోపణలొచ్చిన నేపథ్యంలో బ్రిటన్ ఆమె వినతిని తిరస్కరించటంలో వింతేమీ లేదు.

కానీ ఆమెను అప్పగించాలని కోరిన వెంటనే మన ప్రభుత్వం అందుకు అంగీకరించటం సాధ్యమేనా? చట్టబద్ధ పాలన ఆనవాళ్లు లేవు సరికదా... ఎడాపెడా కక్షపూరిత విధానాలు అమలవుతున్నప్పుడు కోరిన వెంటనే ఒక మాజీ అధినేతను అప్ప గిస్తారని బంగ్లా ఎలా అనుకుంది? ఉగ్రవాదుల ఆటకట్టించేందుకు వీలుగా రెండు దేశాలూ 2013లో నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

తగిన సాక్ష్యాధారాలు అందజేశాకే నేరస్తుల్ని అప్పగించాలని ఉన్న నిబంధనను కాస్తా వారెంటు జారీ అయితే చాలు అప్పగించవచ్చని సవరిస్తూ 2016లో ఆ ఒప్పందాన్ని సరళం చేశారు. కానీ తనపై పెట్టిన కేసులు న్యాయసమ్మతమైనవి కాదని, అందువల్ల అప్పగింత వినతిని తిరస్కరించాలని హసీనా మన ప్రభుత్వాన్ని కోరుకోవచ్చు. రాజ కీయ కారణాలతో అప్పగించాలని కోరితే తిరస్కరించొచ్చని ఒప్పందంలోని నిబంధనలే చెబుతున్నాయి.

సంక్లిష్టమైన ఈ ప్రక్రియంతా పూర్తికావటానికి సుదీర్ఘకాలం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హసీనా విషయంలో అక్కడి న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా వ్యవహరిస్తుందన్న విశ్వాసం తమకు లేదని మన ప్రభుత్వం చెప్పే అవకాశం కూడా ఉంది. ఒకవేళ మన దేశం అందుకు సంసిద్ధత చూపినా హసీనా మన కోర్టుల్ని ఆశ్రయించి ఉపశమనం పొందుతారు.

బ్రిటన్‌తో మనకు నేరస్తుల అప్పగింత ఒప్పందం ఉన్నప్పటికీ రుణాలు తీసుకుని బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మేర మోసగించి పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా వంటివారిని రప్పించటం అసాధ్యమవుతున్నది. మన దేశంలో ఉగ్రవాద ఘటనలకు పాల్పడి పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టి అప్పగించటానికి కొన్ని యూరప్ దేశాలు నిరాకరిస్తున్నాయి. మన న్యాయవ్యవస్థ, జైళ్లు ప్రామాణికంగా లేవన్న కారణాలు చూపుతున్నాయి.

అసలు తన ప్రస్థానం ఏ విధంగా కొనసాగించదల్చుకున్నదో బంగ్లాదేశ్ నిర్ధారించుకోవాలి. ఆ దేశ ఆవిర్భావానికి మూలకారణమైన 'బెంగాలీ భావన'కు తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోంది. బంగ్లా విముక్తిని తాము గుర్తించబోమని చెప్పే ఘనులు తయారవుతున్నారు. అడుగడుగునా మత ఛాందసుల ప్రాబల్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

మన దేశంతో సంబంధాల పునరుద్ధరణకు నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకొనేందుకు బంగ్లా ఇంతవరకూ సిద్ధపడలేదు. పైగా పాకిస్తాన్‌తో అంటకాగేందుకు ఉత్సాహపడుతోంది. 53 యేళ్ల క్రితం ఒక దేశంగా ఆవిర్భవించటానికి ముందు పాక్ సైనిక పాలకులు తమను ఎంత దారుణంగా అణచేశారో ఈ తరం మరిచిపోయి ఉండొచ్చు. 30 లక్షలమందికి పైగా ప్రజల బలిదానాలతో ఏర్పడిన దేశం కళ్లముందు కుప్పకూలుతుంటే నిశ్చేష్టులై ఉండిపోవటం విషాదకరం. అత్యంత విషమ పరిస్థితుల్లో కూడా ఎంతో అప్రమత్తతతో, వివేకంతో వ్యవహరించిన శ్రీలంక పౌరులను ఆదర్శంగా తీసుకుంటేనే దేశానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని బంగ్లా ప్రజలు తెలుసుకోవాలి.

# సుపరిపాలన సాకారం కావాలంటే...

మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినమైన డిసెంబరు 25ను సుపరిపాలనా దినోత్సవంగా 2014 నుంచి జరుపుకొంటున్నాం. ప్రధానిగా ఉన్నప్పుడు మన పురాణ, ఇతిహాసాలు చెప్పిన రాజధర్మాన్ని పాటించి సుపరిపాలన చేశారాయన. అందుకే ఆయన పాలనకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించి, కొనసాగిస్తోంది. రామాయణంలో రాముడు భరతుడికి సుపరిపాలన గురించి చెబుతూ రాజ ధర్మాన్ని వివరిస్తాడు.

మహాభారతంలో అంపశయ్యపై ఉన్న భీష్మ పితామహుడు ధర్మరాజుకు సుపరిపాలన గురించి వివరించాడు. భీష్ముడి ఉద్దేశంలో సుపరిపాలన ఆకాంక్షించే ప్రభువులు నైతిక విలువలను విస్మరించరాదు. ఆచార్య చాణక్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో సుపరిపాలనకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించాడు. 'ప్రజల సంతోషమే రాజు సంతోషం. ప్రజల సంక్షేమంలోనే ప్రభువు సంక్షేమం ఉంది. రాజు సంక్షేమ కోసం కాకుండా ప్రజల సంతానం కోసం మాత్రమే పరిపాలన గావించాలి.'



సుపరిపాలనలో... పరిపాలనను వికేంద్రీకరించాలి. కానీ మన దేశంలో ప్రభుత్వ పాలన కేంద్రీకృతమైనట్లు విమర్శలున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మరిన్ని అధి కారాలు కల్పించాలి. స్థానిక ప్రభుత్వాలను 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా కొంత బలోపేతం చేసినప్పటికీ అవి అనేక రాష్ట్రాలలో నిధులు లేని విధులు నిర్వహిస్తున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

స్థానిక సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. సత్వర న్యాయం లభించాలి. అనేక కారణాల వల్ల ప్రజలకు న్యాయస్థానాల్లో సత్వర న్యాయం లభించడం లేదు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది. తగిన సమయంలో లభించని న్యాయం అన్యాయంతో సమానం. అన్ని న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల కొరత కారణంగా, లక్షల్లో కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. కేసుల సత్వర నివారణకు అవసరమైన సంస్కరణను న్యాయ వ్యవస్థలో ప్రవేశపెట్టాలి.

సుపరిపాలన అంటే అవినీతి రహిత పాలన. దురదృష్టవశాత్తు ప్రభుత్వ పాలనలో అవినీతి పెరుగుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అవినీతి నిరోధక శాఖలైన సీబీఐ, ఏసీబీ, విజిలెన్స్ కమి షన్లను స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలుగా పని చేయనివ్వాలి. అనేక సందర్భాల్లో సుప్రీం కోర్టు సీబీఐని పంజరంలో చిలకలా అభివర్ణించడం గమనార్హం. అవినీతికి పాల్పడే వారికి కఠినమైన శిక్షలు విధించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. పరిపాలనలో పారదర్శకత ఉండాలి. ఇందుకోసం 2005లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించడం హర్షించదగ్గ పరిణామం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని నీరు గార్చడానికి ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర సమాచార కమిషన్‌లోనూ, రాష్ట్రాల సమాచార కమిషన్‌లోనూ ఏర్పడిన ఖాళీలను భర్తీచేయడం లేదు. ఇటువంటి చర్యలు సుపరిపాలనకు వ్యతిరేకం. సుపరిపాలనలో ప్రజలకు నిర్ణయాలలో తగిన పాత్ర ఉండాలి. ప్రజలు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ, చట్ట బద్ధమైన వ్యవస్థల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలలో భాగస్వాములు కావాలి.

పార్టీ ఫిరాయింపు చట్టాన్ని సదుద్దేశంతో రూపొందించిప్పటికీ అందులో ఉన్న కొన్ని లోపాల వల్ల ఆ చట్టం ఆశయాలు నెర వేరలేదు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడం కోసం అవసరమైన చర్యలు గైకొనాలి. ఇవన్నీ జరిగినప్పుడే సుపరిపాలన సాధ్యం అవుతుంది.

# చెదిరిన జీవితాలు... వీడని జ్ఞాపకాలు!



డిసెంబర్ 26వ తేదీ వచ్చిందంటే విషాద ఛాయలు ఆవ రిస్తాయి. సునామీ మన దేశపు సముద్రపు తీర ప్రాంతాన్ని 2004 డిసెంబర్ 26 నాడు ఎంత గట్టి దెబ్బ కొట్టిందో... ఆ క్రమంలో చోటుచేసుకున్న అన్ని దృశ్యాలూ నా కళ్లముందు ప్రత్యక్షమవుతాయి. నేను కెనడియన్ హైకమిషన్ ఢిల్లీ కార్యాలయంలో సీనియర్ సలహాదారునిగా పనిచేసి 2015లో పదవీ విరమణ చేశాను. నా ఉద్యోగ బాధ్యతల్లో ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన పని ఒక కీలక భాగం. విశాలమైన మన దేశంలో ఏడాదంతా ప్రకృతి వైపరీత్యాలు పలురూపాల్లో (వరదలు, కరువు, అకాల వర్షాలు, భూకంపాలు, తుఫానులు, అడవి కార్చిచ్చులు, వేడి-చలిగాలులతో చావులు) జీవజాలాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ప్రాణనష్టంతో పాటు మౌలిక వసతుల్ని నాశనంచేసి... సవాళ్లను ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగాలకు వదిలేసి వెనుదిరిగి పోతాయి.

ప్రకృతి వైపరీత్యాలతో నా బంధం 1999 అక్టోబర్ 29 నాడు ఒరిస్సాలో వచ్చిన సూపర్ సైక్లోన్‌తో మొదలయ్యింది. అదొక పెద్ద విషాదం. ఇరవై వేలకి పైగా జనాన్ని పొట్టన పెట్టుకొంది. ఆ తర్వాత రెండు సంవత్సరాలకే అంటే 2001 జనవరి 26న (రిపబ్లిక్ డే) గుజరాత్‌లోని భుజ్ ప్రాంతాన్ని కుదిపిన బలమైన భూకంపం వచ్చింది. ఉద్యోగ రీత్యా ఫీల్డ్ విజిట్ కోసం వెళ్ళాను. వందశాతం నెలకొరిగిన గ్రామాలను చూసి చలించిపోయాను. విధ్వంసపు తీవ్రతని కళ్ళారా చూశాక, జీవితంలో మొదటిసారిగా నాకు నోట మాటరాలేదు. బాంబుల దాడికి సంపూర్ణంగా నాశనమైన గ్రామాల మధ్యలో నడుస్తున్న భావన. కూలిన ఇండ్లు, విసిరి పడేసినట్టుగా ఇంటి సామాన్లు, పిల్లల వస్తువులు, చెల్లాచెదురుగా పడి ఉన్న దేవుళ్ళ పటాలు, పెళ్లి ఫోటోలు... ఎనభై సెకండ్ల భూకంపానికి చిన్నా భిన్నమైన జన జీవన దృశ్యాలు! నాలోని రచయిత ఏదైనా రాద్దాం (కథో, నవలో...) అనే ఆలోచనల్లో పడి ఓ వైపు సామగ్రినంతా చక్కగా అమర్చి పెట్టుకొన్నాను. కథలో మరణమృదంగం ఇమడలేదు. బలమైన వస్తువు కదా... నవల రాద్దాం అంటే సమయం దొరకలేదు.

గుజరాత్ భూకంపపు ప్రాజెక్టుల్ని పూర్తిచేసి కాస్త ఊపిరి పీల్చుకొంటున్నామో లేదో, 2004 డిసెంబర్ రానే వచ్చింది. సునామీతో మనదేశపు తూర్పుతీర ప్రాంతాన్ని చావుదెబ్బ కొట్టింది. మన దేశంతో సహా పదమూడు దేశాల్లో మహా బీభ త్సాన్ని వదిలి వెళ్లింది సముద్రం. మనదేశంలో ఇరవై వేలకి పైగా చనిపోయారంటారు. కానీ అంత కంటే ఎక్కువే అని అనధికారికంగా చెబుతుంటారు. జనవరి (2005) మొదటి వారంలో ఫీల్డ్ విజిట్ మొదలు పెట్టి రెండువారాలు మూడు రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ) దెబ్బ తిన్న ప్రదేశాల్ని చూస్తూ తిరిగాను.

ఎన్నో కష్టాల కోర్చి అంకిత భావంతో పనిచేస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థలను కలిశాను. ప్రభావితులైన వారి స్థితి ఏంటి? తక్షణ అవసరాలేమిటి? ఎవరు ఎలాటి సహాయ కార్యక్రమాలను చేపట్టారు? దాతలు సహాయాన్నందించడానికి ఎలా ముందుకు వస్తున్నారు వంటి విషయాలపై ఒక అవగాహన కోసం ఎందరినో కలిశాను. మూడు రాష్ట్రాలూ పుస్తకాల్లో దొరకని జ్ఞానపు గనుల్ని నా ముందుకు తెచ్చాయి. 2009 వరకు కెనడా దేశం ఆర్థిక సహాయాన్నిచ్చిన ప్రాజెక్టులు పూర్తయ్యాయి.

ప్రాజెక్టు పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ నాలోని రచయిత ఏం రాయాలా అని ఆలోచిస్తూ ఉన్నాడు. అప్పుడే ఊపు అందుకొంటున్న 'నానీల' ప్రక్రియ పట్ల ఆకర్షితుడనై, 'సునామీ నానీలు' అనే 45 పేజీల పుస్తకాన్ని వంద నానీలతో ప్రచురించి సునామీ వచ్చి సంవత్సరం పూర్తికాకముందే ప్రచురించాను. నాకు గొప్ప తృప్తినిచ్చింది. తరువాత ఇది ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువదింపబడి రెండు భాషల సాహితీ ప్రియులకీ చేరింది. ఈ చిరు పుస్తకాల అమ్మకాలతో వచ్చిన డబ్బుని (రూ. 37,000) రెండు స్వచ్ఛంద సేవా సంస్థలకు విరాళంగా ఇచ్చాను.

ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఫైళ్లని మూసేశాము. మళ్ళీ ఆ ప్రదేశాల్ని తిరిగి చూసే అవకాశాలు రావు. అయిదేళ్లుగా తరచుగా వెళ్లి తిరిగిన ప్రాజెక్టు ప్రాంతాల్లో ఇరవై సంవత్సరాల్లో చాలా మార్పులు తప్పక వచ్చి ఉంటాయి. అప్పటి పిల్లలు యువకులైపోయుంటారు. మధ్య వయస్కులు అరవై దాటి వృద్ధాప్యంలోకి అడుగు పెట్టి ఉంటారు. పిల్లల్ని కోల్పోయిన తల్లులు మళ్ళీ పిల్లల్ని కని ఉంటారు. వారందరి మోహాలపై నవ్వుల్ని చూసే అవకాశం రాదు. రానే రాదు. అందరూ సునామీ తమకి మిగిల్చిన విషాదాన్ని పీడకలగా భావించి ఆశావాదంతో నెమ్మదిగా నిలదొక్కుకొంటూ, కాలక్రమేణా ముందుకు దూసుకుపోయి ఉంటారని ఊహించుకొంటూ ప్రతి డిసెంబర్ చివరివారం గడుపుతుంటాను.



# దమ్మాయిగూడ మున్సిపల్ లో ఏథేచ్ఛగా అక్రమ షెడ్ నిర్మాణాలు

**చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు**
**కీసర వెళ్లే మెయిన్ రోడ్ ప్రగతి నగర్ లో అక్రమ షెడ్ నిర్మాణం**

**దమ్మాయిగూడ డిసెంబర్ 25,( సిటీ టైమ్స్) :** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసర వెళ్లే మెయిన్ రోడ్డు ప్రగతి నగర్ లో అక్రమ షెడ్ నిర్మాణం . అక్రమార్కులు ధర్జాగా రాత్రికి రాత్రి అక్రమ షెడ్ నిర్మాణం చేస్తుంటే అధికారులు ఎంచేస్తున్నారు అనేది అంతుచిక్కడం లేదు? మున్సిపల్ ఆదాయం సమకూర్చే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ ప్రథమ పాత్ర పోషిస్తుంటే... అక్రమ నిర్మాణాలతో ఖజానాకు గండిపడుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారు? ఈ క్రమంలో అక్రమాలకు అడ్డాగా మారిన దమ్మాయిగూడ మున్సిపల్... వివరాల్లోకి వెళ్తే కీసర వెళ్లే మెయిన్ రోడ్డులో రాత్రికి రాత్రి అక్రమ షెడ్ నిర్మాణాలు జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు అక్రమనిర్మాణాల పై గతంలో ఎన్నోసార్లు కథనాల రూపంలో ప్రచురించిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవరించడం ఎంతవరకు సమంజసం? ఈ అక్రమ షెడ్ నిర్మాణాల పై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నాయి.








# భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ శతజయంతి సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** వనపర్తి జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ మరియు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అయ్యప్ప దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లాడుతూ బీజేపీ వ్యవస్థాపకులు మాజీ ప్రధానమంత్రి భారతరత్న స్వర్గీయ ఏ.బి.వాజ్ పాయ్ చేతుల మీదుగా పురుడు పోసుకున్న బిజెపి నేడు దేశంలో 70% రాష్ట్రాలలో అధికారంలో ఉందని వాజ్ పాయ్ ఆశయ సాధనకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశేష కృషి చేస్తున్నారని ఆర్టికల్ 370 ట్రిపుల్ తలాక్ మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి తీసుకొచ్చి వాజ్ బాయ్ గారి ఆశయాలను సాధ్యం చేశారని గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజ్ బాయ్ సుదీర్ఘకాలం భారత రాజకీయాలలో అజాతశత్రువుగా వెలుగొందారని మొదటిసారి 13 రోజులు



రెండవ పర్యాయం 13 నెలలు ఎన్డీఏ సారథ్యంలో ప్రధానమంత్రిగా అధికారంలో ఉండి నాటి కాంగ్రెస్ రాజకీయ చదరంగ విశ్వాస పరీక్షలో ఒక్క ఓటుతో ఓడిపోయి, ధైర్యంగా ఎన్నికలకు వెళ్ళిన నిస్వార్థ రాజకీయ నాయకుడు వాజ్పేయి గారని ప్రత్యర్థులు కూడా ఆరోపణ చేయలేని అజాతశక్తువుగా రాజనీతిజ్ఞుడుగా వెలుగుందారని రాజకీయరంగంలో ఎంత సౌమ్యంగా ఉన్నా పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పేలా పాకిస్తాన్ కు బస్సు ప్రయాణానికి చొరవ తీసుకుంటే కుక్క బుద్ధి చూపించిన పాకిస్తాన్ కు కార్గిల్ యుద్ధంలో ముచ్చెమటలు పట్టించి వారి భూభాగంలోకి 13 కిలోమీటర్ల మేర చొచ్చుకుపోయి పాకిస్తాన్ కి చావు దెబ్బ తినిపించి దేశ రక్షణ విషయంలో రాజీ పడేది లేదని తేల్చి చెప్పిన మహా నాయకుడు మహా మేధావి వాజ్ పాయ్ గారని వారి ఆశయాలకు అనుగుణంగా భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి నారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి రాష్ట్ర నాయకులు పురుషోత్తం రెడ్డి, బి శ్రీశైలం జిల్లా నాయకులు బి కుమారస్వామి,ఏ సీతారాములు మని వర్దన్, గోపీనాథ్ యాదవ్,రాజశేఖర్ గౌడ్, కృష్ణ గౌడ్,ఎండి ఖలీల్ పట్టణ నాయకులు బచ్చు రాము, సూగురు రాములు, రాయన్న, ఎద్దుల రాజు, భూపతి గౌడ్, నవీన్ చారి, విజయసాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.




# పెద్దమందడి మండల కేంద్రంలో అంబేద్కర్ కాలనీలో రైజింగ్ హాండ్స్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 5k రన్

**పెద్దమందడి, సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** పెద్దమందడి మండల కేంద్రంలో 5k రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నీ గ్రామంలోని చిన్న పిల్లలతో జెండా ఊపి 5k పరుగును ప్రారంభించారు, 5K రన్ పూర్తయిన తర్వాత యువతను ఉద్దేశించి టీమ్ సభ్యులు మాట్లాడుతూ... సమాజంలో ఐక్యతకు యువత కృషి చేయాలి టీమ్ స్ఫూర్తితో ముందుకు సాగితే సమాజమంతా ఒకటిగా ఉంటుంది, అలాగే ప్రతిరోజూ ఉదయం రన్నింగ్ జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కోవడానికి ఔషధంలా పనిస్తుందని, మనిషికి మానసిక దృఢత్వంతో పాటు శారీరక దృఢత్వం అవసరమని చెప్పారు ఈ కార్యక్రమంలో రైజింగ్ హాండ్స్ సొసైటీ టీమ్ తో పాటుగా అంబేద్కర్ అసోసియేషన్ వారు,గ్రామ పిల్లలు యువత 5k రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.





# వనపర్తి జిల్లాలో ఘనంగా క్రిస్మస్ జన్మదిన సంబరాలు...

**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** వనపర్తి జిల్లాలోని అన్ని మండలాలు. జిల్లా కేంద్రంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.. ఏసుక్రీస్తు బోధనలు . శాంతి ప్రేమ సౌబ్రాతత్వం సహనం ఎప్పటికీ అనుసరణీయమని కొనియాడారు. క్రైస్తవులు జిల్లాలోని ఆయా ప్రధాన చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఇండ్లలో కుటుంబ సభ్యులతో కలిసి చిన్నారులు క్రిస్మస్ కేకు కట్ చేసి సంబరాలను ఘనంగా ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.. ఆయా రాజకీయ పార్టీల నేతలు స్నేహితులు కాలనీ వాసులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.









# పుట్టినరోజు వేడుకలకు హాజరైన నియోజకవర్గ యువనేత T.సాయి చరణ్ రెడ్డి

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ఆహ్వానం మేరకు వారి అన్న కుమార్తె పుట్టినరోజు వేడుకలకు నియోజకవర్గ యువనేత సాయి చరణ్ రెడ్డి , మాజీ ఎంపీపీ సానే కిచ్చారెడ్డి వారిని ఆశీర్వదించారు. పిల్లల జీవితంలో ఇలాంటి కార్యక్రమాలకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని, వారి ఆనందాలను తల్లిదండ్రులుగా గౌరవించాల్సిందే అని అన్నారు ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగపురం కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, ఖిల్లా ఘనపూర్ కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్, ఖిల్లా ఘనపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, వేణుగోపాల్ , రవి నాయక్, రాము, క్యాంప్ ఆఫీస్ నందిపేట తిరుపతయ్య, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బి ఎం ఎస్ రాష్ట్ర సంఘు కార్యదర్శి మంత్రి జి. రామ్మోహన్ మరియు జిల్లా అధ్యక్షుడు ఎద్దుల సత్యం కరపత్రాలు విడుదల చేశారు

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** ఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామన్ గౌడ్, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరే మధు తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (BMS G445)జిల్లా ప్రెసిడెంట్ ఎద్దుల సత్యం,ఉపాధ్యక్షుడు మారం కవికుమార్ రెడ్డి, సెక్రెటరీ P. వరదరాజు మరియు డివిషన్ ప్రెసిడెంట్ పోతుల రవికాంత్ రెడ్డి,సెక్రెటరీ బండారు రాజు కోశాధికారి రాఘవేందర్ ,మహేశ్వ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మరియు రాష్ట్ర ప్రజలకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుప్రభువు బోధనలు శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనం, ఎప్పటికి అనుసరణీయమని అన్నారు. క్రిస్టియన్ సోదరులు సంతోషంతో,ఆనందోత్సహాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలని ఆకాక్షించారు. క్రీస్తు అనుసరించిన మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధికై అందరు పాటుపడాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు ఆచరనీయమని, కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. మానవాళిని సత్య మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని చెప్పారు.



# అయ్యప్ప స్వామి మహపడి పూజకు రావుల లక్ష ఆర్థిక సహకారం

**వనపర్తి సిటీ టైమ్స్ డిసెంబర్ 25:** అయ్యప్పస్వామి దేవాలయములో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహింపబడే అయ్యప్ప మండల మహపడిపూజకు రావుల చంద్రశేఖరరెడ్డి గారు లక్ష రూపాయల ఆర్థిక సహకారం అందించారు అని నందిమల్ల.అశోక్ తెలిపారు. గౌరవ రావుల చంద్రశేఖరరెడ్డి గారు ప్రతి మండల పూజకు ఆర్థిక సహకారం అందించడమే కాకుండా దేవాలయ అభివృద్ధి కోసం ఎం.పిగా నిధులు కేటాయించారని అదేవిధంగా దేవాలయ ముఖద్వారం వారి తల్లి వెంకటపద్మమ్మ పేరిట నిర్మించారని అశోక్ తెలిపారు. రావుల.చంద్రశేఖర్ రెడ్డి గారు మొదటి నుండి గుడికి సహకారం అందిస్తున్నారని వారుఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో ఉండాలని గురుస్వాములు,ఆలయ కమిటీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నగేష్, గట్టు.వెంకన్న,ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ శర్మనందిమల్ల.అశోక్,రంగం.శ్రీను, సంద.రమేష్,వెంకటేష్, పెండెమ్.శ్రీను,బాలు నాయుడు గురుస్వాములు ఉన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుని ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కి సన్మానం

**పాలకుర్తి, డిసెంబర్ 25, (సిటీ టైమ్స్):** ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ ,చాకలి ఐలమ్మ మార్కెట్ కమిటీ, డైరెక్టర్ పసులాది యాకన్నకు, తెలంగాణ ఉద్యమకారుడు గ్యార సారంగపాణి, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పాలకుర్తి మండలం లో, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు సారధ్యంలో ఘనంగా నిర్వహించిన అనంతరం సారంగపాణి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో నిజాయితీగా ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడి పనిచేసిన వ్యక్తికి గుర్తింపు దక్కడం నిజంగా గొప్ప విషయమని తెలిపారు. ఇంక వారు మాట్లాడుతూ కష్టపడ్డ వారికి గుర్తింపు దక్కితే ఎవరు నిస్పృహకు గురికారని పార్టీ పట్ల నమ్మకం కలుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో, సీనియర్ జర్నలిస్టులు, గుమ్మడి రాజుల సాంబయ్య, ప్రెస్ క్లబ్ గౌర అధ్యక్షులు, మాసంపల్లి నాగయ్య, ప్రెస్ క్లబ్ కోశాధికారి, కొత్తకొండ వాసు. గిరగానిసుధాకర్, తూడి పరుశరాములు, కమ్మగాని వెంకటేశ్వర్లు, అబ్బోజు యాకస్వామి. ధనుంజయ్, గజ్జి సంతోష్. తదితరులు పాల్గొన్నారు.



# కృత్రిమ మేధ.. డేటా సైన్స్

**2025లో ఐటీ కొలువులు ఈ నైపుణ్యాలపైనే**
**చిన్న నగరాల్లో శాఖలు- నియామకాలు**
**ఐటీ రంగంలో ఆశాజనక పరిస్థితులు**




దేశీయ ఐటీ రంగంలో ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏడాది కాలంగా ఐటీ రంగ నియామకాల్లో క్షీణత కనిపించింది. ఇప్పుడు ఐటీ కంపెనీలు కృత్రిమ మేధ, డేటా సైన్స్ వంటి నైపుణ్యాలపై దృష్టి సారిస్తున్నాయి. వ్యయాలు తగ్గించుకునేందుకు రెండో అంచె నగరాల్లోనూ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నందున, ఈ ప్రాంతాల్లోనూ ఐటీ ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. తెలంగాణాలో చూస్తే వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టణాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఐటీ కంపెనీలు విస్తరిస్తుండటం గమనార్హం.

**ఈ ఏడాది 7% తక్కువ**

దేశీయ ఐటీ రంగంలో 2023తో పోలిస్తే 2024లో నియామకాలు 7% తగ్గాయి. స్థూల ఆర్థిక వ్యవస్థ పనితీరు సరిగా లేకపోవడం, ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల వల్ల, వాణిజ్య సంస్థల నుంచి ఐటీ వ్యయాలు తగ్గడమే ఇందుకు కారణం. పరిస్థితులు సర్దుకుంటున్న నేపథ్యంలో, 2025లో ఐటీకి గిరాకీ అధికమై, ఈ రంగంలో ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

**జీసీసీలే కీలకం**

ఐటీ రంగంలో ఉద్యోగాలను కల్పించడంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కీలకంగా మారాయి. నూతన నియామకాల్లో దాదాపు 52.6% నిపుణులను ఇవి నియమించుకున్నాయి.

**ఏఐ, ఎంఎల్ నియామకాల్లో 39% వృద్ధి**

ఈ ఏడాది కూడా కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) నైపుణ్యాలున్న వారికి మాత్రం ఉద్యోగావకాశాలు సులువుగానే లభించాయి. ఏఐ/ఎంఎల్ ఉద్యోగాల్లో 39% వృద్ధి కనిపించింది. 2024 మూడో త్రైమాసికంలో ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ నియామకాల్లో చెప్పుకోదగ్గ వృద్ధి నమోదయ్యింది. టెక్ హబ్‌లుగా వెలుగుతున్న నగరాలకు బయటా ఉద్యోగావకాశాలు ఉన్నాయనే విషయాన్ని ఇది సూచిస్తోంది. మధ్య స్థాయి నుంచి అనుభవం ఉన్న నిపుణుల నియామకాలూ 35% పెరిగాయి. కంపెనీలు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఇందుకు కారణం.

**ప్రాంగణ నియామకాలు తగ్గాయి**

ఈ ఏడాదిలో 'ఫ్రెషర్స్'కు ఉద్యోగావకాశాలు 215% క్షీణించాయి. ఐటీ కంపెనీలకు ప్రాజెక్టులు సరిగా లేకపోవడంతో ప్రాంగణ నియామకాలపై ప్రభావం చూపించిందని సమాచారం. కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయని నిర్ధారించుకున్నాకే, కంపెనీలు ఆఫ్‌క్యాంపస్ పద్ధతిలో తాజా ఉత్తీర్ణులను నియమించుకున్నాయి.

**కొత్త ఏడాదిపైనే ఆశలు..**

2025కు సంబంధించి మ్యాన్‌పవర్ గ్రూపు ఎంప్లాయ్‌మెంట్ ఔట్‌లుక్ సర్వే ప్రకారం.. ఐటీ సంస్థలు కొత్తగా నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. కొత్త ఏడాదిలో ప్రాజెక్టులు వచ్చే అవకాశాలు అధికంగా కనిపిస్తుండటంతో ఐటీ సంస్థలు ప్రాంగణ ఎంపికలపైనా దృష్టి సారిస్తున్నాయి. ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త సాంకేతికతలపై ఉద్యోగాలు అధికంగా లభిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి సంస్థలు నియామకాలను పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ సీఓఓ జైదీప్ కేవలమణి అన్నారు. స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటం, అమెరికా ఎన్నికల ఫలితాలు రావడం, మూలధన పెట్టుబడులు పెరగడం 2025కు సానుకూల అంశాలని పేర్కొన్నారు. ప్రాజెక్టులు ప్రారంభమవుతున్న కొద్దీ, కొత్త గ్రాడ్యుయేట్లకు అవకాశాలు పెరుగుతాయి. ఏఐ, అధునాతన సాంకేతికతలపై గణనీయ అవకాశాలున్నాయని విప్రో సీటీఓ సంధ్య అరుణ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతీయ ఐటీ రంగం ఏఐ, ఆటోమేషన్ వైపు వెళ్తోందని, ఇది నియామకాలపై సానుకూల ప్రభావం చూపిస్తూనే ఉంటుందని మ్యాన్‌పవర్ గ్రూప్ ప్రెసిడెంట్ సంజు బల్లూర్కర్ పేర్కొన్నారు. ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి గిరాకీ పెరుగుతోందని తెలిపారు.

# అక్టోబర్‌లో ఈపీఎఫ్‌లోకి 13.41 లక్షల మంది చందాదారులు



**దిల్లీ:** ఉద్యోగ భవిష్య నిధి సంస్థలోకి అక్టోబర్ నెలలో నికర ప్రాతిపదికన 13.41 లక్షల మంది కొత్త చందాదారులు చేరినట్లు కేంద్ర కార్మిక శాఖ వెల్లడించింది. ఇందులో 7.50 లక్షల మంది తొలిసారి ఉద్యోగంలో చేరిన వారిగా వెల్లడించింది. ఉపాధి అవకాశాలు పెరగడం, ఈపీఎఫ్ఓ చేపడుతున్న అవగాహన కార్యక్రమాల మూలంగా ఈ సంఖ్య పెరుగుదల సాధ్యమైందని కార్మిక శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్తగా సభ్యులుగా చేరిన వారిలో 1825 వయసున్న వారే 58.49 శాతంగా ఉన్నట్లు కార్మికశాఖ తెలిపింది. వీరి సంఖ్య 5.43 లక్షలుగా పేర్కొంది. సంఘటిత రంగంలో ఉద్యోగంలో చేరుతున్న వారిలో యువతే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని, అందులో తొలిసారి ఉద్యోగంలో చేరిన వారి సంఖ్యే అధికమని డేటా చెబుతోంది. అక్టోబర్ నెలలో ఈపీఎఫ్ఓను వీడి మళ్లీ చేరిన వారి సంఖ్య 12.90 లక్షలుగా ఉందని కార్మిక శాఖ తెలిపింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారిలో 2.09 లక్షల మంది మహిళలు ఉన్నారని తెలిపింది. అత్యధికంగా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, దిల్లీ, హరియాణా, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో చందాదారులు చేరినట్లు పేర్కొంది. రోడ్డు మోటార్ ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రైవేటు బ్యాంకులు అక్టోబర్ నెలలో అధికంగా ఉపాధి కల్పించిన రంగాలుగా నిలిచినట్లు వెల్లడించింది.

# ట్రంప్ చర్యలు.. ఆర్‌బీఐ వడ్డీరేట్ల నిర్ణయాలపై ప్రభావం?



అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ తీసుకోబోయే విధానపరమైన చర్యలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలను ప్రభావితం చేయొచ్చని స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ నివేదిక పేర్కొంది. ట్రంప్ ఎలాంటి విధానాలు అవలంబిస్తారోనన్న ఆందోళనలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత నిర్ణయాలపై ప్రభావం చూపే అంశాలుగా నిలుస్తాయని పేర్కొంది. దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందని నివేదిక అంచనా వేసినప్పటికీ.. ఆహార ధరల్లో అస్థిరత కొనసాగుతూనే ఉంది. మరోవైపు ట్రంప్ నిర్ణయాలు, టారిఫ్‌ల భయాల నేపథ్యంలో వడ్డీ రేట్ల కోత కాస్త ఆలస్యం కావొచ్చని నివేదిక తెలిపింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. అధిక ద్రవ్యోల్బణం అనేది స్టాక్, బాండ్లపై ప్రభావం చూపనుందని తెలిపింది. 2022లో ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెరుగుదల.. స్టాక్‌లు, బాండ్‌లపై ప్రతికూల చూపిందని గుర్తు చేసింది. దీంతో మార్కెట్లో బాండ్ల ప్రభావం తగ్గి.. పెట్టుబడిదారులకు ప్రత్యామ్నాయ వ్యూహాలను ఎంచుకొనేలా చేస్తుందని పేర్కొంది. ఇక రక్షణ రంగాలు, అధిక నాణ్యత గల స్టాక్స్‌లు ద్రవ్యోల్బణ సమయంలోనూ స్థిరమైన రాబడి ఇవ్వొచ్చని నివేదిక అభిప్రాయపడింది. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ 2025లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణాన్ని లక్షిత పరిధి అయిన 4 శాతానికి చేరువైన నేపథ్యంలో వచ్చే ఏడాది 50 75 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం ఉందని తెలిపింది. అయితే అధిక ద్రవ్యోల్బణం కారణంగా వడ్డీ రేట్ల తగ్గింపు వెంటనే ఉండకపోవచ్చని పేర్కొంది.




# నవంబర్‌లో నో క్రెడిట్ కార్డ్.. తగ్గిన చెల్లింపులు

పండగ సీజన్ ముగియడంతో క్రెడిట్ కార్డు ద్వారా చేస్తున్న వ్యయాలు దేశీయంగా తగ్గుముఖం పట్టాయి. అక్టోబర్‌లో రూ.2.02 లక్షల కోట్లతో రికార్డు స్థాయిలో ఉన్న క్రెడిట్ కార్డ్ చెల్లింపులు ఆ తర్వాత క్రమంగా క్షీణించాయి. నవంబర్ నాటికి 16.1 శాతం తగ్గి రూ.1.70 లక్షల కోట్లకు చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. క్రెడిట్ కార్డ్ వినియోగం క్రమంగా తగ్గుతోందని ఆర్‌బీఐ గణాంకాలు చూస్తే స్పష్టమవుతోంది. పండగ సీజన్ నేపథ్యంలో రికార్డు స్థాయిని తాకిన క్రెడిట్ కార్డ్ చెల్లింపులు తర్వాత తగ్గాయి. నవంబర్‌లో క్రెడిట్ కార్డ్ ద్వారా చేసే ఖర్చు గతేడాదితో పోలిస్తే 5 శాతం పెరిగినప్పటికీ.. అంతకుముందు నెల అక్టోబర్‌తో పోలిస్తే 13 శాతం తగ్గుముఖం పట్టాయి. ఆఫ్‌లైన్‌లో జరిగే పాయింట్ ఆఫ్ సేల్ (PoS) లావాదేవీలూ నెలవారీగా 14 శాతం తగ్గితే, ఆన్‌లైన్ చెల్లింపులు 17.5 శాతం క్షీణించాయి. నవంబర్‌లో యాక్సిస్ బ్యాంక్ తన క్రెడిట్ కార్డుల వ్యయంలో 24 శాతం క్షీణతను ఎదుర్కొంది. ఇక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 21 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 16.8 శాతం క్షీణత నమోదైంది. ఇక కార్డుల జారీ విషయానికొస్తే.. ఎస్‌బీఐ 2,31,058 కార్డుల్ని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1,87,118 కార్డుల్ని జారీ చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ 50,767 కార్డుల్ని జారీ చేసింది. ఇక యాక్సిస్ బ్యాంక్ మాత్రం 39,734 కార్డుదారుల్ని కోల్పోయింది. మొత్తం క్రెడిట్ కార్డుల జారీ అక్టోబర్‌లో 7,80,000గా ఉండగా.. నవంబర్‌లో 3,50,000కు తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఏకంగా 73 శాతం క్షీణించింది.

# ఎన్నికల ఫలితాలు, మాంద్యం భయాలు.. స్టాక్ మార్కెట్‌ను కుదిపేసిన అంశాలివే!




ఇతర ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే మంచి ప్రతిఫలాన్ని అందించిన చరిత్ర మన దేశ స్టాక్ మార్కెట్లది. అందుకే విదేశీ మదుపర్లతో పాటు, దేశీయ మదుపర్లనూ అంతలా ఆకట్టుకుంటోంది. ఏటికేడు దేశీయంగా పెరుగుతున్న డీమ్యాట్ ఖాతాలే ఇందుకు నిదర్శనం. మదుపర్ల విశ్వాసంతో కొత్త జీవనకాల గరిష్ఠాలను నమోదు చేశాయి. అదే సమయంలో వివిధ సందర్భాల్లో తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. మదుపర్లను తీవ్ర భయాందోళనలకు గురిచేశాయి. కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ ఈ ఏడాది స్టాక్ మార్కెట్‌ను కుదిపేసిన, ప్రభావితం చేసిన పరిణామాలు ఓసారి నెమరువేసుకుందాం.

దేశీయ బెంచ్ మార్క్ సూచీలైన బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ ఈ ఏడాది సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. జనవరి 1న బీఎస్ఈ సెన్సెక్స్ 72,240 వద్ద ప్రారంభం కాగా.. సెప్టెంబర్ 27న 85,978 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. ఆ రోజు 85,474 వద్ద ముగిసింది. సెన్సెక్స్ చరిత్రలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిఫ్టీ జనవరి 1న 21,741 వద్ద ప్రారంభం కాగా.. సెప్టెంబర్ 27న 26,178 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. సెన్సెక్స్ మంగళవారం (డిసెంబర్ 24) రోజు సెన్సెక్స్ 78,473 పాయింట్లు, నిఫ్టీ 23,728 పాయింట్ల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఈ క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు 8.7 శాతం రాబడులను అందించగా.. నిఫ్టీ 9 శాతానికి పైగా లాభపడింది.

**కీలక ఈవెంట్లు**

**ఎన్నికల ఫలితాలు:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ ఏడాది తీవ్ర ఒడుదొడుకులకు లోనైన సందర్భం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రోజు (జూన్ 4). భాజపా నేతృత్వంలోని ఎన్డీయేనే మరోసారి భారీ మెజార్టీతో అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అన్నీ అంచనా వేయడం.. ఫలితాల రోజు అనుకున్న ఫలితాలు రాకపోవడం స్టాక్ మార్కెట్‌లను కుదిపేసింది. కూటమి పార్టీల మద్దతుతో 286 స్థానాలు గెలుచుకున్నప్పటికీ.. స్పష్టమైన మెజారిటీ రాకపోవడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ ఆ రోజు ఏకంగా 4390 పాయింట్ల మేర పతనం అవ్వగా.. నిఫ్టీ ఏకంగా 1,379 పాయింట్ల మేర కోల్పోయింది. దీంతో మదుపర్ల సంపద దాదాపు రూ.30 లక్షల కోట్లు ఆవిరైంది.

మాంద్యం భయాలు: అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకోవచ్చన్న భయాలు, పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, జపాన్ వడ్డీ రేట్ల పెంపు వంటి కారణాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆగస్టు 5న మరోసారి తీవ్ర పతనాన్ని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 2,223 పాయింట్లు, నిఫ్టీ 662 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. మదుపర్ల సంపద ఒక్కరోజే రూ.15 లక్షల కోట్లు ఆవిరైంది. ఆపై వివిధ సందర్భాల్లో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనవుతూనే ఉన్నాయి.

**బడ్జెట్:** దేశీయ స్టాక్ మార్కెట్లపై ఈ ఏడాది ప్రభావం చూపిన అంశాల్లో బడ్జెట్ కీలకం. బడ్జెట్ రోజు దీని ప్రభావం మన మార్కెట్లపై పెద్దగా లేనప్పటికీ.. కేంద్రం తీసుకున్న కొన్ని నిర్ణయాలు తదనంతర కాలంలో మార్కెట్లపై ఎఫెక్ట్ చూపించాయి. ముఖ్యంగా స్వల్పకాలిక మూలధన రాబడులపై పన్నును 15 శాతం నుంచి 20 శాతానికి పెంచడం, దీర్ఘకాలిక రాబడులపై పన్నును 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచడం వంటివి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. రియల్ ఎస్టేట్‌కు సంబంధించి ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను తొలగించడం వంటి మార్పులూ బడ్జెట్‌లో ప్రతిపాదించినప్పటికీ.. తర్వాత దానికి సవరణ చేశారు. 2024 జులై 23కు ముందు కొనుగోలు చేసిన ప్రాపర్టీలకు కొత్త, పాత పన్ను విధానాలను ఎంపిక చేసుకునే ఆప్షన్‌ను కల్పించారు.

**ఇజ్రాయెల్ - ఇరాన్ వార్:** ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం కూడా మార్కెట్లను బయపెట్టాయి. చమురు ధరలు పెరగడం మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. ద్రవ్యోల్బణ భయాలను రేపింది. తర్వాత వివాదం సద్దుమణగడంతో మదుపర్లు ఊపిరి పీల్చుకున్నారు.

**అమెరికా ఎన్నికలు:** అమెరికా అధ్యక్ష ఎన్నికలను భారత్ సహా ప్రపంచ మార్కెట్లన్నీ ఆసక్తిగా గమనించాయి. రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ విజయం సాధించడంతో అమెరికా వృద్ధి బాట పడుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో వాణిజ్య యుద్ధ భయాలూ మార్కెట్లలో నెలకొన్నాయి. ట్రంప్ ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనన్న ఆందోళనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కొత్త ఏడాదిలోనూ ఈ భయాలు కొనసాగే అవకాశం ఉంది.

**విదేశీ ముదపర్ల అమ్మకాలు:** దేశీయ స్టాక్ మార్కెట్లను కలవరపెట్టిన మరో అంశం విదేశీ మదుపర్ల అమ్మకాలు. ఈ ఏడాది ఏప్రిల్, మే, అక్టోబర్, నవంబర్ నెలల్లో విదేశీ మదుపర్లు నెట్ సెల్లర్లుగా నిలిచారు. ఆయా నెలల్లో దేశీయ మార్కెట్ల నుంచి పెద్ద మొత్తంలో నిధులను ఉపసంహరించుకున్నారు. ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో దాదాపు రూ.1.16 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. ఒక్క అక్టోబర్ నెలలో రూ.94 వేల కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. చైనా మార్కెట్లు ఆకర్షణీయంగా కనిపించడం, దేశీయంగా కార్పొరేట్ ఫలితాలు ఆశించిన మేర లేకపోవడం వంటివి ఇందుకు కారణాలుగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. డిసెంబర్‌లో మాత్రం మళ్లీ కొనుగోళ్లకు ఉపక్రమించడం సానుకూల పరిణామం.

**గౌతమ్ అదానీ:** ఈ ఏడాది కూడా అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ మరోసారి వార్తల్లో నిలిచారు. గతేడాది హిండెన్‌బర్గ్ నివేదిక నుంచి కోలుకుంటున్న అదానీ గ్రూప్‌పై, ఇటీవల అమెరికా న్యాయ శాఖ లంచం ఆరోపణలు చేయడంతో అదానీ గ్రూప్ స్టాక్స్‌పై పెద్ద ఎత్తున ప్రభావం పడింది. తర్వాత కాస్త కోలుకున్నాయి.




# ఓలా ఎలక్ట్రిక్ 3,200 కొత్త రిటైల్ స్టోర్లు.. 4వేలకు చేరిన సంఖ్య

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన రిటైల్ స్టోర్ల సామర్థ్యాన్ని పెంచింది. దేశవ్యాప్తంగా కొత్తగా 3,200 స్టోర్లను తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న 800 స్టోర్ల సంఖ్య 4 వేలకు పెరిగిందని ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవీశ్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న తమ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని 4,000కు పెంచడంపై భవీశ్ అగర్వాల్ ఆనందం వ్యక్తం చేశారు. మెట్రో, టైర్ 2, టైర్ 3 నగరాలతో పాటు చిన్న పట్టణాలు, మండల కేంద్రాలకూ తమ సర్వీస్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా ఓలా స్కూటర్‌పై అందిస్తున్న ఆఫర్లను ప్రకటించారు. ఓలా ఎస్1 పోర్ట్‌ఫోలియోలోని స్కూటర్లపై రూ.25వేల విలువైన ప్రయోజనాలు అందిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. నెట్‌వర్క్‌ను పెద్ద ఎత్తున విస్తరించిన సందర్భంగా ఈ ఒక్కరోజు (డిసెంబర్ 25) ఈ ఆఫర్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

# బీమా పాలసీలకు కిరాణా దుకాణాల అండ!

**క్యూఆర్ కోడ్ చెల్లింపుల వల్లే**
**చిన్న పట్టణాలు, గ్రామాలపై పేనియర్‌బై నివేదిక**




**దిల్లీ:** చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో యూపీఐ లావాదేవీలు ఈ ఏడాది 33% పెరిగాయని ఓ నివేదిక తెలిపింది. యూపీఐ చెల్లింపుల సౌలభ్యం ఉన్న విక్రయ కేంద్రాల ద్వారా బీమా కొనుగోళ్లు, ప్రీమియం వసూళ్ల లావాదేవీల సంఖ్య 127% పెరగ్గా, కొత్త వినియోగదార్ల సంఖ్యలో 97% శాతం వృద్ధి ఉందని పేనియర్‌బై రూపొందించిన నివేదిక తెలిపింది. గ్రామీణ, చిన్న పట్టణాల్లోని ఆర్థిక, డిజిటల్ సేవలు అందిస్తున్న 10,00,000 చిన్న విక్రయ కేంద్రాల (కిరాణా దుకాణం, మొబైల్ రీఛార్జ్ కేంద్రాలు లాంటివి) నుంచి సేకరించిన లావాదేవీల వివరాల ఆధారంగా ఈ విశ్లేషణ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు నమోదైన వ్యాపార గణాంకాలను, గతేడాది ఇదే సమయంతో పోల్చి ఈ నివేదిక రూపొందించారు. దేశవ్యాప్తంగా బీమా వ్యాప్తికి ఎదురవుతున్న అవరోధాలను అధిగమించడంలో ఇలాంటి విక్రయ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నివేదిక వివరించింది. ఈ నివేదిక ప్రకారం..

- వ్యాపార రుణాలు, పసిడి రుణాలు, వ్యక్తిగత రుణాల వంటి రుణ ఉత్పత్తుల లావాదేవీల సంఖ్య 297% పెరిగింది. గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో రుణాలపై అవగాహన, గిరాకీ పెరుగుతుండటాన్ని ఇది తెలియజేస్తోంది
- ఈ ఏడాది మైక్రో ఏటీఎం, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థల (ఏఈపీఎస్) ద్వారా నగదు ఉపసంహరణ తగ్గింది. వీటి నుంచి ఒక్కో లావాదేవీ ద్వారా సగటు నగదు ఉపసంహరణ 2023లో రూ.2,624 కాగా.. 2024లో రూ.2,482కు తగ్గింది.
- ఈ ఏడాది మిగతా సమయంతో పోలిస్తే, ప్రభుత్వం నుంచి పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) జరుగుతున్న సమయంలో ఏఈపీఎస్ ద్వారా నగదు ఉపసంహరణ 3545% అధికంగా ఉంది. ముఖ్యంగా పీఎం కిసాన్ యోజన లాంటి పథకాల సమయంలో ఈ ధోరణి కనిపించింది.
- జమ్ము కశ్మీర్‌లో నగదు ఉపసంహరణ లావాదేవీల సంఖ్య 74% పెరగ్గా, విలువ 58% అధికంగా నమోదైంది.



# కేఎల్ రాహుల్ @'పదేళ్లు'.. బాక్సింగ్ డేతో కెరీర్ మొదలెట్టి..

జట్టుకు భారం అనే స్టేజీ నుంచి.. జట్టుకు వరం అనే స్థాయికి ఒక ఆటగాడు ఎదిగాడు అంటే.. ఆ ప్రయాణం ఏమంత ఈజీగా సాగి ఉండదు అని చెప్పొచ్చు. ఇలాంటి జర్నీకి నిలువెత్తు నిదర్శనం కేఎల్ రాహుల్. ఈ సీనియర్ బ్యాటర్ అంతర్జాతీయ టెస్టుల్లోకి అడుగు పెట్టి 'బాక్సింగ్ డే' టెస్టుతో (డిసెంబర్ 26న) పదేళ్లు పూర్తి కానుంది. ఆరు నెలల క్రితం వరకు కేఎల్‌కు జట్టులో చోటు దక్కడమే కష్టంగా ఉండేది. ఇప్పుడు అతడు లేనిదే జట్టు ఎంపిక అసాధ్యమనే స్థాయికి ఎదిగాడు. అతడి 'పదేళ్ల' ప్రయాణం వెనుక సాధకబాధకాలు ఏంటో చూద్దాం!

మెల్‌బోర్న్ వేదికగా 2014లో కేఎల్ రాహుల్ (క్యాప్ నంబర్ 284) అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. బాక్సింగ్ డే టెస్టులో అతడు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. విదేశాల్లో డెబ్యూ కావడమే అరుదుగా జరిగే సంఘటన. ఇక తొలి మ్యాచ్‌లో ఘోర ప్రదర్శనతో ఇంకెంత కాలం కొనసాగుతాడులే అంతా భావించారు. కానీ, పట్టు వదలని ఆ భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ మూడు ఫార్మాట్లలోనూ బలంగా పుంజుకొన్నాడు. కెప్టెన్సీ రేసులోనూ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్లతో పోటీపడే స్థాయికి ఎదిగాడు. ఒకదశలో విరాట్ టీ20 సారథ్యం వదిలేసిన తర్వాత కేఎల్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తారని ఊహించారు. అందుకు తగ్గట్టుగానే కొన్ని మ్యాచ్‌లకు (2022లో) నాయకత్వం ఇచ్చారు. కానీ, దానిని నిలబెట్టుకోవడంలో కేఎల్ విఫలమయ్యాడు. కెప్టెన్‌గా సక్సెస్ అయినప్పటికీ.. బ్యాటర్‌గా తేలిపోవడంతో తప్పించాల్సిన పరిస్థితి ఎదురైంది. మూడు ఫార్మాట్లలో కలిపి 16 మ్యాచులకు నాయకత్వం వహించగా.. 11 మ్యాచుల్లో జట్టును గెలిపించాడు. ఐదింట్లో టీమ్ ఓటమిపాలైంది.

> **కలిసొచ్చే బాక్సింగ్ డే...**
> అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను బాక్సింగ్ డేన కేఎల్ ప్రారంభించాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ.. ఆ తర్వాత అతడు ఆడిన రెండు బాక్సింగ్ డే టెస్టుల్లోనూ వరుసగా సెంచరీలు చేశాడు. కాకపోతే, అవి రెండూ సెంచూరియన్ వేదికగా దక్షిణాఫ్రికాతో ఆడాడు. ఇప్పుడు మరోసారి తన డెబ్యూ వేదికైన మెల్‌బోర్న్‌లోనే ఆసీస్‌తో బాక్సింగ్ డే టెస్టు ఆడనున్నాడు. ఇప్పుడు మరోసారి శతకం చేస్తే 'బాక్సింగ్ డే' టెస్టుల్లో హ్యాట్రిక్ చేసిన బ్యాటర్‌గా అవతరిస్తాడు.

**ఆ రెండేళ్లు ఇబ్బందులే..**

ఇప్పటి వరకు 56 టెస్టులు ఆడిన కేఎల్ రాహుల్ 3,216 పరుగులు చేశాడు. ఇందులో ఎనిమిది సెంచరీలు ఉన్నాయి. అతడి సగటు 34.58. అయితే, గత రెండేళ్ల కాలంలో (2022/2023) కేఎల్ రాహుల్ ఆటతీరు దారుణంగా పడిపోయింది. ఈ సమయంలో 7 టెస్టులు మాత్రమే ఆడిన అతడు 280 పరుగులు చేశాడు. ఇందులో ఒకే ఒక్క సెంచరీ ఉంది. ఈ ఏడాది తొలి అర్ధ భాగంలోనూ కేఎల్‌కు అవకాశం దక్కలేదు. సగటు కూడా బాగా పడిపోయింది. టెస్టులతో పోలిస్తే వన్డేల్లో కాస్త ఫర్వాలేదు. కానీ, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పరుగులు చేసేందుకూ ఎక్కువ బంతులు తీసుకుంటున్నాడనే అపవాదును మోయాల్సి వచ్చింది.

**గంభీర్ రాకతో..**

గత రెండేళ్ల ప్రదర్శన చూశాక.. కేఎల్ రాహుల్ మళ్లీ జాతీయ జట్టులోకి రావడం చాలా కష్టమనే అభిప్రాయం అభిమానుల్లో ఏర్పడింది. ఎప్పుడైతే గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా వచ్చాడో.. కేఎల్‌పై నమ్మకం ఉంచాడు. వీరిద్దరూ ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కలిసి పనిచేశారు. ఎన్ని విమర్శలు వచ్చినా.. ఆసీస్ పర్యటన కోసం కేఎల్‌ను ఎంపిక చేశాడు. మరోవైపు రాహుల్ కూడా పట్టుదలతో ఆడటం ప్రారంభించాడు. ఏ నోళ్లు తనపై విమర్శలు గుప్పించాయో వాటికి తాళం వేస్తూ అదరగొట్టాడు. కీలకమైన ఆస్ట్రేలియా పర్యటనలో ఓ వైపు భారత బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటే.. ఆసీస్ బౌలర్లు తననేమీ చేయలేరన్నట్లుగా కేఎల్ వారికి అడ్డుగా నిలిచాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేఎల్ ఆడిన తీరు ఇతర బ్యాటర్లకు గుణపాఠం. ఇక రెండు, మూడు టెస్టుల్లోనూ అతడి ఆట హైలైట్. విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ ఒక మ్యాచ్‌లో సెంచరీలు చేశారు. కానీ, నిలకడ ఆటతీరు ప్రదర్శించలేదు. కానీ, కేఎల్ రాహుల్ అలా కాదు. మూడు హాఫ్ సెంచరీలు సాధించాడు. భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ (235 రన్స్)గా కొనసాగుతున్నాడు. ఓపెనర్‌గా వస్తూనే 47 సగటుతో పరుగులు రాబడుతున్నాడు. స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్, బోలాండ్ వంటి పేస్ బౌలర్లను ఎదుర్కోవడం సాధారణ విషయం కాదు. టాప్ ఆర్డర్ కుప్పకూలుతున్నప్పటికీ తాను మాత్రం తలొగ్గే ప్రసక్తే లేదని నిలిచాడు.

**ముమ్ముందూ ఇలాగే కొనసాగితే..**

ఇప్పుడు సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది. మహా అయితే వచ్చే ఏడాది వరకూ టెస్టులు ఆడతారు. రోహిత్ తర్వాత టెస్టు, వన్డే సారథ్య బాధ్యతలను దక్కించుకొనే అవకాశాలు కేఎల్‌కు మెండుగా ఉన్నాయి. ఇప్పుడీ ప్రదర్శనతో మార్గం ఇంకా సుగమమం కానుంది. జస్‌ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్, గిల్ రేసులో ఉన్నా.. వీరందరి కంటే సీనియర్‌గా కేఎల్ ముందుంటాడు. కానీ, ఆ అవకాశం రావాలంటే నిలకడైన ఆటతీరు ముఖ్యం. ఇప్పుడు ఆడుతున్నతీరులోనే ముమ్ముందూ సాగితే కెప్టెన్ కావడం పెద్ద కష్టమేం కాదనేది క్రికెట్ వర్గాల విశ్లేషణ.

# ఎవరిపై కోపం లేదు.. నా రిటైర్మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదు: అశ్విన్



ఎన్నో మ్యాచుల్లో టీమ్‌ఇండియా విజయాల్లో కీలకపాత్ర పోషించిన రవిచంద్రన్ అశ్విన్ ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన అతడు ఘనమైన వీడ్కోలు లేకుండానే సిరీస్ మధ్యలోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. గబ్బా వేదికగా జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత అశ్విన్ ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. అతను ఉన్నట్టుండి రిటైర్మెంట్ ప్రకటించడం అందరిని షాక్‌కు గురిచేసింది. కపిల్‌దేవ్ వంటి మాజీ క్రికెటర్లు అశ్విన్‌కు ఘన వీడ్కోలు పలికితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అశ్విన్ తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడాడు. తన అంతర్జాతీయ కెరీర్ గురించి ఎలాంటి విచారం లేదని, గొప్ప వీడ్కోలు వంటి అంశాలపై నమ్మకం లేదన్నాడు. 'ఘనమైన వీడ్కోలు అనే కాన్సెప్ట్‌కు నేను వ్యతిరేకం. ఎవరికీ ఇలాంటి వేడుకలు నిర్వహించాలని నేను అనుకోను. ముఖ్యంగా మీరు నాకు గొప్ప వీడ్కోలు ఇవ్వకూడదని నేను గట్టిగా నమ్ముతున్నాను. నా కోసం ఎవరు కూడా కన్నీటి చుక్క రాల్చొద్దు. గ్రాండ్ సెండ్ ఆఫ్‌లు అనేవి సూపర్ సెలబ్రిటీ సంస్కృతిలో భాగమని భావిస్తున్నాను.ఒకరి వెనుక మనం ఎందుకు పరుగెత్తాలి? ఒకరిపై మనకున్న ప్రేమ కోసం మనం ఎవరి వెనుక పరుగెత్తుతున్నామో నాకు అర్థమైంది. కానీ ఒకరు సాధించిన విజయాలు, వారి వారసత్వం, ఆట నుంచి నిష్క్రమించిన విధానం, ఆట గురించి మాట్లాడిన విధానం ద్వారా ప్రజలు ప్రేరణ పొందాలని భావిస్తున్నాను. కానీ, వీడ్కోలు అనేది తప్పు అనుకుంటున్నా. కేవలం నన్ను సెలబ్రేట్ చేసుకునేందుకే ఏదైనా మ్యాచ్ నిర్వహిస్తే అది ఆటకు మంచికాదని నా భావన. నా కెరీర్ గురించి ఎలాంటి బాధ లేదు. 537 వికెట్లు తీసి కూడా సంతోషంగా లేకపోతే మరి దానికి హ్యాపీగా ఫీల్ అవ్వాలి. లేని దాని గురించి నేనెందుకు బాధపడాలి?అని అంగీకరించడంలో గొప్ప ఆనందం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే వీడ్కోలు పలికా. క్రికెట్ గురించి మాట్లాడతాను. నేను యూట్యూబ్‌లో చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తా. కోచింగ్ ఇష్టపడతా. రిటైర్మెంట్ విషయంలో నాకేలాంటి బాధలేదు. ఎవరిపైనా కోపం లేదు. వీడ్కోలు నిర్ణయం తర్వాత ఒక్కసారి కూడా ఏడవలేదు. నా రిటైర్‌మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదు. ఎవరైనా ఉన్నట్లయితే, దాని గురించి నాకు తెలియదు' అని అశ్విన్ పేర్కొన్నాడు.

# బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా రోహిత్ వస్తే..



ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టు ఆడేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. గురువారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. అయితే, భారత బ్యాటింగ్ ఆర్డర్ ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. గత రెండు మ్యాచుల్లో రోహిత్ ఓపెనింగ్ స్థానం నుంచి ఆరో స్థానానికి మారాడు. కానీ, అక్కడ దారుణంగా విఫలమై నిరాశ పరిచాడు. మరోవైపు కేఎల్ మాత్రం ఓపెనర్‌గా అదరగొట్టేశాడు. దీంతో అతడిని పక్కకు జరపలేని పరిస్థితి టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌కు ఎదురైంది. నిన్న ప్రెస్‌కాన్ఫరెన్స్‌లోనూ బ్యాటింగ్ ఆర్డర్‌పై రోహిత్ ఆందోళన అవసరం లేదని చెప్పాడు. కానీ, తాజా కథనాల ప్రకారం రోహిత్ ఓపెనర్‌గా తిరిగి వస్తాడని తెలుస్తోంది. పాత బంతిని ఆడటంలో రోహిత్ ఇబ్బంది పడ్డాడు. ఎటాకింగ్ గేమ్ ఆడి పరుగులు చేయాలని ఇప్పటికే రవిశాస్త్రి వంటి మాజీలు సూచించారు. కొత్త బంతితో రోహిత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తాడు.

**జట్టులో మార్పులు ఉండే అవకాశం**

ఒకవేళ కెప్టెన్ రోహిత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తే.. కేఎల్ రాహుల్ పరిస్థితి ఏంటి? అనే ప్రశ్న తలెత్తడం సహజం. కేఎల్ రాహుల్‌ను వన్‌డౌన్‌లో ఆడిస్తారని.. శుభ్‌మన్ గిల్ ఎక్కడ బ్యాటింగ్ చేస్తాడనేది ఆసక్తికరంగా మారనుంది. ఇక బాక్సింగ్ టెస్టులో టీమ్‌ఇండియా ఇద్దరు స్పిన్నర్లను రంగంలోకి దించనుందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా బ్యాటింగ్ కూడా చేయగలరు. అప్పుడు పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌రెడ్డిని మెల్‌బోర్న్ టెస్టుకు పక్కనపెట్టే అవకాశం లేకపోలేదు. మెల్‌బోర్న్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. ముగ్గురు ప్రధాన పేసర్లతో దిగితే సరిపోతుందనేది క్రికెట్ విశ్లేషకుల అంచనా. అయితే, ఆస్ట్రేలియా ఇప్పటికే తన తుది జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. ముగ్గురు ప్రధాన ఫాస్ట్ బౌలర్లు స్టార్క్, కమిన్స్, బోలాండ్‌తోపాటు పేస్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌కు చోటు కల్పించింది. కొత్త ఆటగాడు సామ్ కాన్స్టాస్‌కు అవకాశం ఇచ్చింది. గాయం కారణంగా సిరీస్‌కు దూరమైన జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో స్కాట్ బోలాండ్‌ను తీసుకుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. అశ్విన్ రికార్డును సమం చేసిన బుమ్రా

బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో అదరగొడుతున్న భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న అతను గబ్బా టెస్టులో తొమ్మిది వికెట్లు పడగొట్టి తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఈ వారం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా (904) రేటింగ్ పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే టెస్టుల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్‌గా అశ్విన్ రికార్డును బుమ్రా సమం చేశాడు. ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్ డిసెంబరు, 2016లో ఈ ఘనత సాధించాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా నాలుగు స్థానాలు దిగజారి 10వ ర్యాంక్‌కు పడిపోయాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఇంగ్లాండ్ బ్యాటర్లు జో రూట్ (895), హ్యారీ బ్రూక్ (876) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. కేన్ విలియమ్సన్ (867) మూడో స్థానంలో కొనసాగుండగా.. భారత్‌పై వరుస శతకాలతో విరుచుకుపడుతున్న ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (825) ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంకులో నిలిచాడు. యశస్వి జైస్వాల్ (805) ఒక స్థానం డౌన్ అయి ఐదో ర్యాంకు, రిషభ్ పంత్ (708) రెండు స్థానాలు దిగజారి 11వ ర్యాంక్‌కు పరిమితమయ్యారు. శుభ్‌మన్ గిల్ (652) నాలుగు స్థానాలు పడిపోయి 20వ ర్యాంక్, విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి 21వ ర్యాంక్‌లో నిలిచారు. రోహిత్ శర్మ ఐదు స్థానాలు డౌన్ అయి 35వ స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటివరకు మూడు టెస్టులు జరిగాయి. ఈ మూడు మ్యాచ్‌ల్లో 21 వికెట్లు పడగొట్టాడు. గురువారం నుంచి మెల్‌బోర్న్ వేదికగా నాలుగో (బాక్సింగ్ డే) టెస్టు ప్రారంభం కానుంది.





# కుటుంబంతో క్రిస్మస్ వేడుకలు.. శాంతాక్లాజ్ వేషధారణలో ధోనీ

ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సెలబ్రిటీలు కూడా క్రిస్మస్ సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కూడా తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. ధోనీ భార్య సాక్షి, కూతురు జీవా, బాలీవుడ్ నటి కృతిసనన్, కబీర్ బహియా తదితరులు ఈ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. ధోనీ శాంతాక్లాజ్ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మిగతా వాళ్లు శాంతాక్లాజ్‌లాగా టోపీలు ధరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సాక్షి సోషల్ మీడియాలో పంచుకుంది. వాటిని చూసిన నెటిజన్లు శాంతాక్లాజ్ గెటప్‌లో ధోనీ క్యూట్‌గా ఉన్నాడని కామెంట్లు పెడుతున్నారు.

# బాబర్‌ను కోహ్లీతో పోల్చుతూ పోస్టు..



పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్‌ను పక్కనపెడుతూ గతంలో సెలక్షన్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని ఆ జట్టు క్రికెటర్ ఫకర్ జమాన్ తప్పు పట్టిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కోహ్లీతో బాబర్‌ను పోల్చుతూ అతడు సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం వివాదాస్పదంగా మారింది. దీంతో అతడిపై పీసీబీ ఆగ్రహం వ్యక్తంచేసి చర్యలు తీసుకుంది. తాజాగా ఈ వివాదంపై ఫకర్ జమాన్ పెదవి విప్పాడు. అది కేవలం తన అభిప్రాయం మాత్రమేనని.. తాను పీసీబీని విమర్శించలేదని చెప్పాడు. ''నేను ఆ ట్వీట్ చేసి ఉండకూడదు. అయితే.. ఆ ట్వీట్‌ను అందరూ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను బోర్డు నిర్ణయాన్ని విమర్శిస్తున్నానని అనుకున్నారు. కానీ అది వంద శాతం తప్పు. ఆ ట్వీట్ చేసిన సమయాన్ని గమనిస్తే.. బోర్డు నిర్ణయం తీసుకోకముందే నేను నా అభిప్రాయాన్ని చెప్పాను. అప్పటికే మాజీ ఆటగాళ్లు, మీడియా బాబర్‌ను విమర్శించడం చూశాను. అతడు పాకిస్థాన్ జట్టుకు ఎంతో చేశాడని.. అతడిని తొలగించాల్సిన అవసరం ఉందా..? అంటూ మద్దతుగా పోస్టు పెట్టాను'' అని ఫకర్ వివరించాడు. ''ఆ ట్వీట్ పూర్తిగా నా అభిప్రాయం మాత్రమే. క్రికెట్ బోర్డు కంటే ఎవరూ పెద్ద కాదు. నా జూనియర్లకూ ఇదే చెబుతాను. మీరు ఎంత పెద్ద క్రికెటర్‌గా ఎదిగినా.. బోర్డు కంటే గొప్ప కాదు. బోర్డు నిర్ణయాలను విమర్శించకూడదని చెబుతాను'' అని ఫకర్ వివరించాడు.

**ఏం జరిగిందంటే..?**

గతంలో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా పేలవ ప్రదర్శన చేసిన బాబర్ అజామ్‌ను తదుపరి టెస్టులకు తీసుకోకుండా జట్టు యాజమాన్యం పక్కనపెట్టింది. అదే సమయంలో ఆ జట్టు క్రికెటర్ ఫకర్ జమాన్ బాబర్‌కు మద్దతుగా ఓ ట్వీట్ పెట్టాడు. ఇందులో కోహ్లీ ప్రస్తావన తీసుకొచ్చాడు. ''బాబర్ అజామ్‌ను తొలగించాలన్న సూచనలు వినడం ఆందోళన కలిగిస్తోంది. 20202023 మధ్య కాలంలో 19.33, 28.21, 26.50 సగటు ఉన్న సమయంలో టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని బీసీసీఐ పక్కన పెట్టలేదు. నిస్సందేహంగా పాకిస్థాన్ సృష్టించిన అత్యుత్తమ బ్యాటర్ బాబర్. అలాంటి స్టార్ ప్లేయర్‌ను పక్కనపెట్టాలన్న నిర్ణయం.. జట్టులో ప్రతికూల సందేశాన్ని పంపుతుంది. మన కీలక ఆటగాళ్లను అణగదొక్కడం కంటే.. వారిని కాపాడుకోవడంపైనే దృష్టిపెట్టాలి'' అని తీవ్రంగా మండిపడ్డాడు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన పీసీబీ.. ఫకర్‌ను సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించింది.

# రాముడికన్నా రావణుడి ఆదాయమే ఎక్కువ!



ఏదైనా సినిమాకు సంబంధించి క్యాస్టింగ్ ఖర్చు లెక్క రాసుకుంటే టాప్ రెమ్యునరేషన్ హీరోకు ఉంటుంది.. తరువాత హీరోయిన్.. అలా ఉంటుంది చివరి రేటు విలన్ కు ఉంటుంది. కానీ ఈ సరికొత్త రామాయణం సినిమాకు సంబంధించి హీరో అయిన రాముడి పాత్రధారి కన్నా విలన్ అయినా రావణుడి పాత్రధారికే ఎక్కువ పేమెంట్ ఇస్తున్నారు. ఎక్కువ అంటే అలాంటిలాంటి పేమెంట్ కాదండి.. ఏకంగా రెండొందల కోట్లు ఇస్తున్నారు. ఇంతకూ ఎవరా రాముడు.. ఎవరా రావణుడు అనేదేగా మీ అనుమానం.. బాలీవుడ్ నిర్మాత, నటుడు నితీష్ తివారి నిర్మిస్తున్న రామాయణం సినిమాకు సంబంధించి హీరోగా అంటే శ్రీరాముడిగా రణబీర్ కపూర్ ను ఎంపిక చేయగా అందులో మరో ప్రధాన పాత్రధారి అయిన రావణుడిగా కేజీఎఫ్ సిరీస్ హీరోగా చేసి బాక్సాఫీస్ కొల్లగొట్టిన కన్నడ స్టార్ యష్ కు మాత్రం హీరోకన్నా ఎక్కువే చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. నటుడిగా ఇచ్చిన పారితోషికంతోబాటు డిస్ట్రిబ్యూషన్ హక్కులు.. అన్నీకలిపి మొత్తం రూ. 200 కోట్లవరకు యష్ కు ఇచ్చేనందుకు తివారీ అంగీకరించారట. ఇది హిందీ సూపర్ స్టార్లు అయినా సల్మాన్ ఖాన్.. అమీర్ ఖాన్.. షారూక్ ఖాన్ ల హీరోల పారితోషికం కన్నా ఎక్కువని తెలుస్తోంది. ఇటీవల ప్రభాస్ హీరోగా వచ్చిన కల్కి చిత్రంలో విలన్ గా నటించిన కమల్ హాసన్ కూడా రూ. 40 కోట్లలోపే తీసుకున్నారట. కానీ యష్ మాత్రం ఏకంగా రూ. 200 కోట్లు తీసుకోవడాన్ని చూసి బాలీవుడ్ సైతం షాక్ అయిందని అంటున్నారు. సల్మాన్ , షారూక్.. అమీర్ ఖాన్లు సైతం ఇంతవరకూ హీరో పారితోషికంతోబాటు డిస్ట్రిబ్యూషన్ హక్కులు సైతం తీసుకుంటారు. ఓటీటీ స్ట్రీమింగ్ రైట్స్ వంటివి అన్నీ కలుపుకున్న వారికి ఇంతవరకూ.. రూ. 150 కోట్లు దాటలేదట. కానీ తన అసాధారణ నటనతో కన్నడ బాక్సాఫీస్ కొల్లగొట్టిన యష్ మాత్రం విలన్ పాత్రకోసం ఏకంగా రూ. 200 కోట్లు తీసుకుంటున్నట్లు నితీష్ తివారి అఫీస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇక సూపర్ స్టార్లు కూడా ఈ మార్కును టచ్ చేయలేదంటే ఇక రణబీర్ కపూర్ పారితోషికం ఈయనతో సరికిపోల్చడం కూడా కుదరదు అంటున్నారు. ఇక షారూక్ వంటి స్టార్లతో సమానంగా పారితోషికం తీసుకున్నది సౌత్ ఇండియాలో ముగ్గురే ఉన్నారు. రజనీకాంత్, విజయ్ తలపతి , అల్లు అర్జున్ మాత్రమే ఒక్కో సినిమాకు రూ. 200 కోట్లు తీసుకుంటున్నారట . మొత్తానికి మన సౌత్ ఇండియన్ నటుడు యష్ విలన్ పాత్రలో రెండు వందలకోట్ల పారితోషికం తీసుకుని బాలీవుడ్ హీరోలకు సవాల్ విసిరారు.

# కియారా, అలియాలతో అనుచిత ప్రవర్తన ఆరోపణలు.. స్పందించిన హీరో



బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ ఎన్నో రోజులుగా సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఆరోపణలపై స్పందించారు. ఓ ఈవెంట్‌లో అలియాభట్ ప్రైవేట్ పార్ట్స్‌ను తాకడం, షూటింగ్‌లో కియారా అడ్వాణీని అందరిలో ముద్దుపెట్టుకోవడంపై వరుణ్ ఎన్నో రోజులుగా విమర్శలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వీటిపై స్పందించారు. ''నేను షూటింగ్ సమయంలో నటీనటులందరితో ఒకేలా ఉంటాను. నా సహనటులతో ఎన్నోసార్లు సరదాగా ఇలా ప్రవర్తించాను. కానీ, ఆ విషయం గురించి ఎవరూ ప్రస్తావించలేదు. మీరు ఈ విమర్శలపై ప్రశ్న అడిగినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికైనా ఈ విషయంలో క్లారిటీ ఇచ్చే అవకాశం వచ్చింది. నేను అందరిలో కియారాను ఉద్దేశపూర్వకంగా ముద్దు పెట్టుకోలేదు. ఒక మ్యాగజైన్ ఫొటోషూట్‌లో భాగంగా అలా చేశాం. ఆ క్లిప్‌ను నేను, కియారా ఇద్దరం సోషల్ మీడియాలో పంచుకున్నాం. ఇదంతా ప్లాన్ చేసి చేసినదే. ఆమె మంచి నటి. ఇక అలియా విషయానికొస్తే.. తను నాకు మంచి స్నేహితురాలు. ఆరోజు సరదాగా అలా చేశానంతే. కావాలని చేయలేదు. అది సరసాలాడడం కాదు. మేమిద్దరం ఇప్పటికీ స్నేహితులమే'' అని చెప్పారు.

ప్రస్తుతం వరుణ్ 'బేబీ జాన్'తో ప్రేక్షకులను పలకరించారు. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రానికి కథను అందించారు. కాలీస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాతో కీర్తి సురేశ్ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. వామికా గబ్బీ, జాకీ ష్రాఫ్ కీలకపాత్రలు పోషించగా.. సల్మాన్‌ఖాన్ అతిథిపాత్రలో కనిపించారు.

# ఫిబ్రవరిలో మొదలు



కథానాయకుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ చేస్తున్నారు. ఇది ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. దీన్ని జనవరి చివరి నాటికి పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విజయ్ కొత్త చిత్ర సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆయన రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఫిబ్రవరి నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. అంతేకాదు దీని కోసం విజయ్ గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిసింది. 185478 మధ్య రాయలసీమ నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. దీంట్లో విజయ్ దేవరకొండ శక్తిమంతమైన యోధుడి పాత్రలో కనువిందు చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రష్మిక కథానాయికగా కనిపించే అవకాశముంది. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

# సూర్య 44 టైటిల్ టీజర్ రిలీజ్..




సూర్య హీరోగా దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు ఓ చిత్రాన్ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. నేడు క్రిస్మస్ సందర్భంగా దీని టైటిల్ టీజర్‌ను టీమ్ విడుదల చేసింది. 'రెట్రో'గా ఇది రానున్నట్లు తెలిపింది. ఇప్పటికే దీని చిత్రీకరణ కూడా పూర్తయింది. ప్రేమ, యుద్ధం నేపథ్యంలో రానున్న ఈ సినిమాలో సూర్య సరసన పూజాహెగ్డే నటించారు. 'నాది స్వచ్ఛమైన ప్రేమ..' అని టీజర్‌లో సూర్య చెప్పిన డైలాగ్ అందరికీ ఆకట్టుకుంటోంది.



# సతి విచ్చేసింది



కథానాయకుడు రామ్‌చరణ్ సమర్పణలో నిఖిల్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది ఇండియా హౌస్'. రామ్ వంశీ కృష్ణ తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సయీ మంజ్రేకర్ కథానాయిక. మంగళవారం సయీ పుట్టినరోజు ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి ఆమె ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. తనిందులో సతి అనే సంప్రదాయ యువతిగా కనిపించనున్నట్లు ఆ ప్రచార చిత్రంతో స్పష్టత ఇచ్చారు. "ప్రేమ, విప్లవం అంశాలతో ముడిపడిన పీరియాడిక్ డ్రామా చిత్రమిది. 1905 నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాకి నిఖిల్, సయీల ప్రేమకథ ప్రధాన ఆకర్షణగా నిలవనుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు.

# ఆ ఒక్క మాట నా జీవితాన్ని మార్చేసింది



'తంగలాన్', 'యుద్ధ్రా'తో ఈ ఏడాది ప్రేక్షకులను అలరించారు నటి మాళవికా మోహనన్ సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ఆమె తాజాగా ఎక్స్ వేదికగా చిట్‌చాట్ నిర్వహించారు. అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు తనదైన శైలిలో బదులిచ్చారు. కొత్త సినిమా విశేషాలు పంచుకున్నారు.

2025 మీకు ఎలా ఉండనుంది?

'సర్దార్ 2', 'రాజా సాబ్' కొత్త షెడ్యూల్స్‌తో కొత్త ఏడాదిలో ప్రయాణం మొదలుకానుంది. వరుస సినిమాలతో వచ్చే ఏడాది నాకు చాలా ప్రత్యేకంగా ఉండనుంది.

క్రిస్మస్ ఎలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు?

చాలాకాలం తర్వాత నాకు క్రిస్మస్‌కు బ్రేక్ దొరికింది. అమెరికాలో ఉండే నా స్కూల్ ఫ్రెండ్స్‌ను కలవనున్నా. వారితో సరదాగా గడపనున్నా.

ఈ తరం యువతకు మీరిచ్చే సలహా ఏమిటి?

పని ఏదైనా షార్ట్‌కట్స్ అనేవి ఉండవు. మనం శ్రమిస్తేనే విజయాన్ని ఆస్వాదించగలం.

'పేటా' సినిమాలో మీ రోల్ నాకెంతో ప్రత్యేకం?

మీకే కాదు నాక్కూడా. ఆ సినిమా నా మనసుకు ఎంతో చేరువైంది. నేను నటించిన తొలి తమిళ చిత్రమిదే.

విరాట్, అల్లు అర్జున్‌ను ఒక్క మాటలో వర్ణించండి?

ఒక్క మాటలో కష్టం.. కాకపోతే కోహ్లీ కింగ్. అల్లు అర్జున్ స్టైల్ ఎవరిలోనూ కనిపించదు.

మీ జీవితాన్ని మార్చిన సూచన ఏమిటి?

ఒక పెద్దాయన ఒకానొక సమయంలో ఏం చెప్పారంటే.. 'కామెంట్ సెక్షన్‌ను ఏమాత్రం చదవొద్దు'. ఈ ఒక్క మాట నా జీవితాన్ని ఎంతో మార్చింది.

తెలుగు ప్రేక్షకులకు మీ అందాన్ని ఎప్పుడు చూపించనున్నారు?

వచ్చే ఏడాది ఆగస్టులో రాజాసాబ్ విడుదల కానుంది. నేను అందంగా ఉన్నానో, లేదో ప్రేక్షకులే నిర్ణయించాలి.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana.
Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896